

# శ్రీ హనుమత్ జ్ఞానపుష్పాలు



సంపుటి - 1 **డిజిటల్ మాస పత్రిక** సంచిక - 2

**శివశ్రీ గెంటేల వెంకటరమణ గురుదేవుల జీవన స్వీయజ్ఞాన కరదీపిక**



## భవిష్యబ్రహ్మ చతుర్ముఖ ఆంజనేయస్వామి

**శ్రీ గురుధాం ధర్మక్షేత్రం**

**జూలై 2026**

**శ్రీ శివానందగురు ఎడ్యుకేషనల్ & కల్చరల్ ట్రస్ట్ - బలుసుపాడు**

# శ్రీ హనుమత్ జ్ఞానపుష్పాలు

సంపుటి-1 డిజిటల్ మాసపత్రిక - జూలై 2026 సంచిక - 2

శివశ్రీ గెంటేల వెంకటరమణ గురుదేవుల జీవన స్వీయజ్ఞాన కరదీపిక

ప్రకాశకులు

శ్రీ శివానందగురుఎడ్యుకేషనల్ & కల్చరల్ ట్రస్ట్

శ్రీగురుధామ్ ధర్మక్షేత్రం, బలుసుపాడు, జగ్గయ్యపేట (మం), ఎన్‌టిఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు : శ్రీ గెంటేల ఆనంద శంకర్, శ్రీగురుధామ్ ధర్మక్షేత్రం, బలుసుపాడు


**ఓంనమో - భగవతే - శ్రీశివానందాయ**

**శ్రీహనుమ జయహనుమ శివానంద హనుమ**

## ఈ సంచికలో....


| | |
|---|---|
| ఆధ్యాత్మిక దివ్యధామం... శ్రీ గురుధామ్ ధర్మక్షేత్రం జ్ఞానక్షేత్రం! అర్థికి తగిన అనుగ్రహం!! | 3 |
| సందేహ నివారణ | 4 |
| అమృత గుళికలు - ఆధ్యాత్మిక రత్నాలు | 5 |
| విచారణా స్రవంతి | 6 |
| మనసుకు పూర్ణత్వమే గురుపూర్ణిమ | 7 |
| భావసారూప్యతే భారతీయత | 13 |
| సనాతన ధర్మాచరణకు ఏకాదశ సూత్రాలు | 18 |
| ఆనందం కూడా పరపతి, హోదా లాంటిదేనా ? | 20 |
| ఇది తెలిస్తే కష్టాలు ఉండవు | 25 |
| విహితకర్మలే సరళమైన సాధనామార్గం.... | 33 |
| At the Guru's Feet: A Guru Purnima Reflection - *Gentela Anand Shankar* | 40 |
| గురుపాదాల చెంత : గురుపూర్ణిమ ఆలోచనలు | 43 |


**కళ్లు మూస్తే దైవాన్ని స్మరించు - కళ్ళు తెరిస్తే దేశాన్ని సేవించు**

FOR PRIVATE CIRCULATION ONLY

## ఆధ్యాత్మిక దివ్యధామం... శ్రీగురుధాం ధర్మక్షేత్రం

# జ్ఞానక్షేత్రం! అర్థికి తగిన అనుగ్రహం!!

ఆర్తులు, జిజ్ఞాసువులు, అర్థార్థులు, జ్ఞానులనే పుణ్యాత్ములు భగవంతుని భజిస్తారని భగవద్గీతాచార్యుడి ఉద్బోధ. వీరిలో జ్ఞానులు భగవంతునికి అత్యంత ఇష్టులుగా, దైవానికి ప్రతిరూపాలుగా నిలుస్తారు. అటువంటి జ్ఞానవతారంగా జన్మజన్మలుగా అరుదెంచే మహాత్ములే సద్గురు శ్రీశివానందమూర్తి భగవానులు. ఆత్మజ్ఞాన స్వరూపులైన శివశ్రీ రమణగురుదేవుల సంకల్పంతో సద్గురుమూర్తిని ప్రతిష్టించుకున్న అపర జ్ఞానక్షేత్రమే శ్రీగురుధామ్ ధర్మక్షేత్రం. అత్యున్నతమైన జ్ఞానంతో పాటు అర్హతను బట్టి అర్థులైన వారందరికీ వారివారి అవసరాలను తీర్చే వరదాయినిగా ఈ క్షేత్రం అనుగ్రహిస్తున్నది. భగవంతుడు అడిగిన కోరికలను మాత్రమే తీరుస్తాడు. కానీ గురువు తనను ఆశ్రయించిన జీవుడి ఉద్ధరణకోసం అడక్కుండానే అవసరాలను కూడా గుర్తించి వాటిని నెరవేరుస్తాడు. ఈ భారతీయ గురుతత్త్వానికి నిలువెత్తు నిరూపణమే మన శ్రీగురుధామం. గురుతత్త్వ మహత్యాన్ని సోదాహరణంగా నిరూపితం చేసే ఎన్నో ఘటనలు, సంఘటనలు, తార్కాణాలు ఈ ధర్మక్షేత్రంలో అనునిత్యం తారసపడతాయి. శారీరక, మానసిక, కుటుంబ సమస్యలతో సతమతమౌతూ పరిష్కారాల కోసం వచ్చే ఆర్తులకు ఈ క్షేత్రం సేద తీరుస్తుంది. వారికి ఇక్కడి గురుతత్త్వజ్ఞానం సత్వర ఉపశమనంతోపాటు అవగాహనతో కూడిన శాశ్వత సాంత్వనను కూడా ప్రసాదిస్తుంది. జన్మాంతర పుణ్య వాసనలతో దైవాన్ని తెలుసు కోవాలనుకునే జిజ్ఞాసులకు ఇది జ్ఞాన ప్రదాయినిగా నిలుస్తున్నది. వారివారి జన్మ సంస్కారాలకు అనుగుణంగా భక్తి, యోగ, విచారణా మార్గాల్లో సందేహాలను తీరుస్తుంది. మానవ సహజమైన కోర్కెలను నెరవేర్చుకోవాలనుకునే అర్థార్థులకు ధర్మయుతమైన మార్గంలో వాటిని తీర్చుకునే మార్గాన్ని చూపిస్తుంది. సద్బోధతో వారిలో అవాంఛనీయ తృష్ణను తొలగించే జ్ఞానబీజాలను కూడా నాటుతున్నది. మనసులను పరవశింపచేసే ప్రేమ, కరుణ, దయవంటి సహజ దైవీగుణాల ప్రబోధంతో ప్రతివారి హృదయంలో అమృతాన్ని ఆవిష్కరింప చేస్తుంది. అన్నిరకాల భక్తులను ఒక ఆత్మీయ గురుకుటుంబంగా కలిపి ఉంచే ఈక్షేత్రం వసుధైక కుటుంబ భావాన్ని ప్రబోధించే భారతీయతకు నిలువెత్తు నిరూపణగా నిలుస్తున్నది.

## ఎరుక మారలేదు.... వ్యవహారంకోసం మనసుగా పిలవబడుతుంది!

**ప్రశ్న : మనసుగా మారిన ఎరుకను తిరిగి ఎరుకగా మార్చడమెలా?**

**శివశ్రీ రమణ గురుదేవులు :** ఒక రంగస్థల నటుడు ప్రదర్శన తర్వాత తన కృష్ణుడి వేషధారణలోనే ఇంటికి వెళ్లాడు. అతని కుమారుడైన చిన్న పిల్లాడు 'అమ్మా ఎవరో వచ్చారు' అంటూ అరిచాడు. అమ్మ వచ్చి 'వారు మీ నాన్నగారేరా!' అని చెప్పింది. సరిపోల్చుకున్న ఆ పిల్లాడు 'నాన్నా' అంటూ తండ్రివద్దకు వెళ్లాడు. ఇక్కడ ఆ వ్యక్తి తన వేషధారణను తొలగించలేదు. భార్య, పిల్లాడు కేవలం వివేకంతో, విచారణ చేసి పరిశీలన ద్వారా ఆ నటుడి అసలు రూపాన్ని పోల్చుకున్నారు. కృష్ణ వేషధారణ వ్యవహారంకోసం వేసుకున్నదే కానీ అది తన రూపాన్ని ఏమీ మార్చలేదు. మారినట్లుగా కనిపించారు అంతే. అది కేవలం పైన వేసుకున్న వేషం మాత్రమేనని తెలుసు కనుకనే భార్యాపిల్లలు అదే వేషంలో ఉన్నా వారిని అనుమతించారు. మనలో ఎరుకగా మారిన ఆత్మచైతన్యం కూడా అంతే... అది కేవలం జీవనం కోసం మనసు అనే వేషధారణలో ఉంది. ఇక్కడ అది మనసుగా మారలేదు... కేవలం వ్యవహారం కోసం మనసుగా పిలవబడుతుంది. జీవనం కోసం ఎరుక మనసుగా మారినట్లు అనిపిస్తుంది. మనసుగా పిలవబడినా అది ఎరుకకు భిన్నం కాదని వివేకంతో విచారణ చేసి తెలుసుకున్న మనసు ఆ అవగాహనలో నిలిచిపోతుంది. తిరిగి మనసును ధ్యానంగా మార్చాలని, ఎరుకగా మార్చాలని ప్రయత్నించదు. ఇప్పుడు తాను జీవనం కోసం ఉపయోగపడే మనసే ఎరుక అని దృఢమైన స్థిరనిశ్చయం వస్తే మనసును మార్చడం, ఏమార్చడం చేయకపోయినా దాని అసలు స్వరూపం ఎరుకగానే ఉందని అర్థం చేసుకొని నిశ్చింతగా ఉంటుంది. నటుడు వేషధారణ వల్ల కృష్ణుడిగా పిలవడినా తన నిజరూపం మారనట్లే.... ఎరుక జీవనం కోసం జ్ఞాపకాలను ఆలంబనగా చేసుకొని మనసుగా పిలవబడినా దాని స్వరూపం ఎరుకగానే ఉంటుంది. ఆత్మజ్ఞానం కోసం సాధన చేసే మనసుకు తన శుభేచ్ఛవల్ల, పవిత్రతవల్ల గురువు అనుగ్రహంతో ఈ సత్యం అర్థమౌతుంది. జీవనం కోసం మనసుగా ఉన్నా అంతరంగంలో తాను ఎరుకగా ఉన్న శుద్ధచైతన్యాన్నే అన్న సత్యంతో అది ఉంటుంది.

## శివశ్రీ గెంటేల వెంకటరమణ గురుదేవుల జ్ఞాన పుష్పాలు

❖ కోరిక ఉంటే ఉన్నది తెలియదు! ఉన్నది ఉన్నట్లు చూస్తే కోరిక మిగలదు.

❖ దేహభావన కేవలం ఇంద్రియానుభవాలకే పరమితమైతే మాయా, మోహంగా మిగిలిపోతుంది! విచారణతో సాధనకు ఉపకరణంగా మారితే మనసును సత్యానికి అనుసంధానం చేసే సోపానం అవుతుంది.

❖ జీవనంలో కష్టం, దుఃఖం కలిగినప్పుడు వచ్చే వైరాగ్యం తాత్కాలికంగా నిలిచి ఉంటుంది. వివేక, విచారణలతో కలిగే వైరాగ్యం కష్టం, దుఃఖం నుండి శాశ్వత ఉపశమనంగా ఉంటుంది.

❖ జీవితాన్ని ప్రాపంచిక విషయాలవద్దే ఆపేవారు పారమార్థిక గురువు కాదు, ప్రాపంచిక విషయాలను కూడా పారమార్థిక సోపానాలుగా మార్చేవారే సద్గురువు,

❖ లౌకిక విషయాలపై సాగే విశ్లేషణ ఏదైనా విచారంగా పరిణమిస్తుంది. మనసును గమనించే విచారణతో ఏ విషయమైనా విచారణగా పరిమళిస్తుంది.

❖ లౌకిక ఫలాలను ఇచ్చే విజ్ఞానం భౌతికం.... అది నేర్చుకోవాలి. పారమార్థిక ఫలాలనిచ్చే జ్ఞానం ఆంతరంగికం.... అది తెలుసుకోవాలి.

❖ మన ఎరుకపై ఆధారపడి ఉండే ప్రపంచానికి పూర్ణత్వం లేదు, నిరాధారంగా నిరంతరం వెలుగొందే ఉనికిలో అసంపూర్ణత్వం లేదు.

❖ ధ్యానం పేరుతో ఆలోచనలు తగ్గడం ఆధ్యాత్మిక పురోగతి కాదు, ఆలోచనలపై అవగాహనతో తెలుసుకునే స్వస్వరూప జ్ఞానమే ఆధ్యాత్మిక ప్రగతి.

❖ ఆలోచనల మధ్య ఉండే విరామంలో అందరిలోనూ అంతర్యామి కొలువై ఉంటాడు. సత్యంపై దృష్టి పెరిగితే మనో వేగం తగ్గి ఆ విరామంగా ఉన్న రామం దర్శనమౌతుంది.

❖ సంతోషదుఃఖాల్లో తాత్కాలికంగా మరుగున పడ్డ 'నేను' మళ్లీమళ్లీ వస్తుంది. అవగాహనతో కరిగిపోయిన 'నేను' శాశ్వత ఆనందంగా పరిమళిస్తుంది.

## తెలియడం స్పృహ అనుభూతి భావం

మనకి చల్లని గాలి తగిలినట్లు తెలియగానే ఒక హాయి అయిన అనుభూతి కలుగుతుంది. తెలియడం స్పృహలో భాగమైతే అనుభూతి భావంలో భాగం. కానీ రెండు వేరు కాదు. భావంలో స్పృహను చూస్తున్నామా స్పృహలో భావాన్ని చూస్తున్నామా అన్నదే లౌకిక ఆధ్యాత్మిక జీవనాల వ్యత్యాసం. ఈ నిశిత పరిశీలనే ధ్యానకళ... జ్ఞానానికి పరాకాష్ఠ. మనం బొట్టు పెట్టుకునేటప్పుడు చర్మం తెలుస్తుంది. బొట్టుని అనుభూతి పొందుతాం. తెలిసే చర్మం స్పృహ, పొందిన బొట్టు అనుభూతి భావం. నిశిత పరిశీలనతో ఈ తేడాను తెలుసుకోవచ్చు. నేను అనేది పరమాత్మ స్పృహత్వమే కానీ జీవభావంతో మాట్లాడతాం. పరమాత్మ స్పృహతో మొదలై జీవభావంతో గడపడమే లౌకిక జీవనం. భావాన్ని వీడి స్పృహతో గడపడమే ధ్యాన జీవనం. స్పృహను వీడి భావంతో గడపడం జీవనం. భావం ఉన్నప్పటికీ స్పృహను మరవక పోవడం ధ్యాన జీవనం. "స్పృహ-భావం" రెండూ ఒకదానిని ఒకటి వీడి ఉండవు. దేని వాడి దానిదే. దేనిని వాడుకుంటున్నామన్నదే లౌకిక ఆధ్యాత్మిక జీవనాల వ్యత్యాసం. భావాలు అనే నగలు ఎన్ని అయినా ఉండవచ్చు. కానీ స్పృహగా ఉండే బంగారం ఒక్కటే. భావంలో నుండి స్పృహలోకి జారటం ధ్యానం. స్పృహలో నుండి భావంలోకి జరగటం జీవనం. సముద్రం స్పృహగా ఉంటుంది. అలలు భావాలుగా ఉంటాయి. సముద్రాన్ని ఆధారంగా చేసుకుని లక్షలాది అలలు వచ్చిపోతుంటాయి. లోకంలోని ఈ మొత్తం జీవరాశి అంతా ఉనికిగా ఉన్న ఆ సముద్రం అనే స్పృహపై భావంగా కదలాడే అలలు లాంటివే. ఒడ్డుకు చేరిన అల ఒకటి, సముద్రంలో మొదలైన అల ఒకటి, ప్రయాణంలో ఉన్న అల ఒకటి. అదే వైవిధ్యం, కర్మ, జనన మరణాలు. ఎంత కదిలినా ఎన్ని కదిలినా అవి ఉనికిగా ఉన్న సముద్రాన్ని విడిపోవు. ఇది తెలియడమే జ్ఞానం అంటే. స్పృహ సముద్రంగా ఉంది... భావాలు అలలుగా ఉన్నాయి. స్పృహ సముద్రం... అల భావం ... అలా భావాలు కొనసాగటమే జీవనం.

ఓం నమో భగవతే శ్రీ శివానందాయ

# మనసుకు పూర్ణత్వమే గురుపూర్ణిమ

'**గు**రుపూర్ణిమ' అనే మాటకు లోతైన అర్థం ఉంది. గురువు అంటే జ్ఞానము, పౌర్ణమి అంటే పూర్ణము. మనసు పూర్ణమవడమే గురుపూర్ణిమ. ప్రస్తుతం మన మనసు ఎలా ఉందంటే, కొంత సుఖం, కొంత దుఃఖంతో అసంపూర్ణంగా ఉంది. ఎంతటి కష్టాలు, జబ్బులు ఉన్నా రాత్రి ఆరు గంటలు నిద్రలో సుఖపడుతున్నాము కాబట్టి మనది పూర్ణ దుఃఖము కాదు, అలాగని నిరంతర సుఖము కాదు. మన మనుష్య జన్మ కూడా పూర్తిగా పుణ్యము కాదు, పూర్తిగా పాపము కాదు; 50-50 నిష్పత్తి లాంటిది. మనం పూర్తిగా మంచివాళ్లము కాదు, పూర్తిగా చెడ్డవాళ్లము కాదు. అలాగే మనకు దేవుడి గురించి, గురువు గురించి, చివరికి మన భార్య లేదా భర్త గురించి కూడా కొంత తెలుసు, కొంత తెలియదు. సర్వజ్ఞులైన శాస్త్రవేత్తలకు కూడా తెలిసింది చాలా కొద్ది శాతమే. గురుపూర్ణిమ అంటే కేవలం గురువుకు దండలు వేయడం, బట్టలు పెట్టడం, శుభాకాంక్షలు చెప్పడం మాత్రమే కాదు. మన మనసులో నిరవధికమైన, నిరంతరమైన సంతోషం కలగడమే నిజమైన గురుపూర్ణిమ. ఆ నిరంతర సంతోషానికే 'ఆనందం' అని పేరు. ఆ ఆనంద స్థితిని కలిగించేవాడే గురువు. సమాజంలో, ఇళ్లలో భార్యాభర్తల మధ్య, స్నేహితుల మధ్య, చివరకు ఆశ్రమాలలో గురుశిష్యుల మధ్య కూడా గొడవలు రావడానికి ముఖ్య కారణం 'అపార్థం' (సరిగా అర్థం చేసుకోకపోవడం). మనుషులు సరిగా అర్థం కాకపోతే గొడవలు అవుతాయి, మనసు పూర్తిగా అర్థం కాకపోతే సగమే సంతోషం మిగులుతుంది.

పరమ పవిత్రమైన గురుపౌర్ణిమ సందర్భముగా సద్గురుదేవులు బోధించిన పరమార్థాన్ని మనమందరం మననం చేసుకోవాలి. ఆషాఢ పౌర్ణమితో ఉత్తరాయణ కాలం ముగిసి, దక్షిణాయన కాలం ప్రవేశించే సంధికాలం ఇది. పెద్దల మాట ప్రకారం దక్షిణాయన కాలం జీవుడికి అంత క్షేమకరమైనది కాదు. ఉత్తరాయణంలో జీవుడి మనసు సహజంగానే ఉత్తరముఖంగా, అంటే జ్ఞానం వైపు తేలికగా

పయనిస్తుంది. కానీ దక్షిణాయన కాలంలో మనసు లౌకిక ప్రపంచం వైపు, భౌతిక సంబంధమైన కోరికల వైపు ఉరకలు వేస్తుంది. నీరు ఎలాగైతే ఎత్తు నుండి పల్లమునకు సహజంగానే ప్రవహిస్తుందో, అలాగే మెలుకువ రాగానే మనసు ప్రకృతి సిద్ధంగా ప్రపంచం వైపు లాగుతుంది. పొద్దున లేచిన దగ్గర నుండి పిల్లలకైనా, పెద్దలకైనా తెలియకుండానే మనసు ఈ ప్రపంచంతో సంబంధాన్ని ఏర్పరుచుకుంటుంది. ఇంగ్లీషులో దీనినే మనం 'మైండ్' అంటాము. ఈ మనసు గురించే అనాదిగా పెద్దలు మనల్ని జాగృతపరుస్తూ, దాని తత్వాన్ని వేదాంతం రూపంలో బోధిస్తున్నారు. పుట్టుకతోనే చంటిబిడ్డ ఏడుస్తూ తల్లితో, ఈ ప్రపంచంతో సంబంధం ఏర్పరుచుకోవడం లోకసహజం. బుద్ధి తెలిసిన దగ్గర నుండి పరిచయాలు, కోరికలు పెరిగి మనసు బయటకే పరిగెడుతుంది. దీనినే ప్రవృత్తి మార్గం అంటారు. మనసును లోపలికి తిప్పితే నివృత్తి మార్గం అంటారు. మనమందరం సహజంగా వృత్తి, ఉద్యోగం, పెళ్లాం, పిల్లలు, చదువులంటూ ప్రవృత్తి మార్గంలోనే జీవిస్తున్నాము. ఇది తప్పూ కాదు, ఒప్పూ కాదు; ఇది కేవలం లౌకిక జీవనం మాత్రమే.

భగవంతుడు మనందరికీ బుద్ధిని ఇచ్చాడు, దాంతో పాటు ఒక స్వాతంత్ర్యాన్ని కూడా ఇచ్చాడు. మంచి చేస్తామా, చెడు చేస్తామా అనేది మన ఇష్టం. మంచి చేస్తే పుణ్యఫలం, చెడు చేస్తే పాపఫలం లేదా కర్మఫలం దక్కుతాయి. ఈ కర్మలకు ఈశ్వరుడు బాధ్యుడు కాదు, ఆయన కేవలం సాక్షిభూతుడు మాత్రమే. మనం చేసిన కర్మల ఫలాన్ని ఆయన మనకు తిరిగి అందిస్తాడు. ఈ దక్షిణాయన కాలంలో నాలుగు మాసాల పాటు 'చాతుర్మాస దీక్ష' అనే నియమం ఉంది. పూర్వకాలంలో చాతుర్మాస్యం అంటే కేవలం యతులకు, సన్యాసులకు మాత్రమే పరిమితం అనుకునేవారు, కానీ గురువుగారు ఇది ఆబాలగోపాలం అన్ని వర్గాల వారికి, అన్ని కులాల వారికి వర్తిస్తుందని చెప్పారు. ఎందుకంటే దక్షిణాయనంలో మనసు బలంగా లౌకిక జీవనాన్ని కోరుకుంటుంది కాబట్టి, దానిని అదుపు చేయడానికి ఇదొక దీక్ష. నాలుగు మాసాలు లేదా కనీసం రెండు మాసాలు, లేదంటే 40 రోజులు, చివరకు 21 రోజులైనా ఏదో ఒక నామస్మరణ చేస్తూ భగవంతుడి వైపు దృష్టి పెట్టడమే ఈ దీక్ష ముఖ్య ఉద్దేశం. యతుల నియమాలు వేరుగా ఉంటాయి. వారు తిన్నచోట పడుకోకుండా, పడుకున్నచోట తినకుండా సంచారం చేస్తుంటారు.

మనలాంటి సామాన్యులు ఆహార నియమాల కంటే కూడా 'వ్యవహార నియమాలను' పాటించడం ఎంతో మంచిది. వ్యవహార నియమం అంటే మనసును కాస్త నెమ్మది చేసుకుంటూ, దృష్టిని పరమాత్మ వైపు మళ్లించడం. ఉరుకులు పెట్టే మనసు యొక్క దిశను మార్చడానికే ఈ చాతుర్మాస్య ఆరంభంలోనే గురుపూర్ణిమ వచ్చింది. మన జీవ లక్షణాన్ని ఎరిగిన గురువు దగ్గరకు వెళ్లి, మన మనసుకు హితమైన మార్గాన్ని, మంత్రాన్ని ఉపదేశించమని కోరాలి.

ఈ కాలంలో అలవాటు చేసుకుంటే, తదుపరి వచ్చే ఉత్తరాయణ కాలంలో మనసు తేలికగా పరమాత్మ వైపు లయమవుతుంది. ఏకాదశి, ముక్కోటి ఏకాదశి, శివరాత్రి వంటి పండుగలను ఈశ్వరుడు మనసును తేలికగా ముక్తి వైపు తిప్పడానికే ఏర్పాటు చేశాడు. ఇది మనసును క్రమశిక్షణలో పెట్టే ఒక వేసవి శిబిరం (సమ్మర్ క్యాంప్) లాంటిది. గురుపూర్ణిమ రోజున లౌకిక కోరికలు, కుటుంబ సమస్యలు, అనారోగ్యాలు వంటివన్నీ పక్కన పెట్టి, కేవలం కృతజ్ఞతతో గురువును ఆశ్రయించాలి. మనకు ఎన్ని జన్మలు ఉన్నాయో, భవిష్యత్తులో ఎన్ని జన్మలు వస్తాయో మనకు తెలియదు. జన్మజన్మలలో పేదరికం, సంపద, పదవులు, చక్రవర్తి యోగాలు మారుతుండవచ్చు కానీ 'బాధ' మరియు 'భయం' అనేవి మాత్రం ప్రతి జన్మలోనూ వెంటాడుతూనే ఉంటాయి. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన అమెరికా దేశానికి అధ్యక్షుడైన ట్రంప్ గారిని ఉదాహరణగా తీసుకుంటే, అంతటి పెద్ద పదవిలో ఉన్నా కూడా ఆయనకు ప్రాణభయం, బాధ తప్పడం లేదు. కాబట్టి బాధ అనేది చక్రవర్తికైనా సామాన్యుడికైనా సమానమే. సుఖం ఉన్నప్పుడు కూడా అది ఎక్కడ పోతుందోననే బాధ ఉంటుంది. ఉదాహరణకు, మనకు సెలవులు వచ్చినప్పుడు హాయిగా ఆనందిస్తాము, ఆలస్యంగా లేస్తాము, కానీ రోజులు గడుస్తున్న కొద్దీ 'అయ్యో సెలవులు అయిపోతున్నాయి' అనే బాధే మనల్ని ఎక్కువగా వెంటాడుతుంది. సుఖం కంటే, దుఃఖం కంటే ఈ బాధే మానసికంగా ఎక్కువ ప్రభావం చూపిస్తుంది. దుఃఖానికి ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యం, పిల్లల ఉద్యోగాలు వంటి ఏదో ఒక కారణం ఉంటుంది. కానీ ఆ కారణం తొలగిపోయినా, చివరికి మిగిలే పర్యవసానమే 'బాధ'. ఈ బాధనే భగవాన్ రమణ మహర్షి 'కారణ శరీరము' అన్నారు. ఈ

కారణ శరీరం అనే బాధను పోగొట్టేవారే సద్గురువులు. అవసరమైతే శిష్యుడి కర్మలను, బాధలను గురువు తనపైకి తీసుకుని కర్మలను నశింపజేస్తాడు. అందుకే గురువు పాదాలు అంత విశేషమైనవి. గురుపూర్ణిమ రోజున గురువు దగ్గరకు వెళ్లి లౌకికమైనవి ఏవీ అడగకూడదు. ఇంట్లో భార్యాభర్తలు, పిల్లలు, ఆస్తులు, నగలు అన్నీ ఉన్నా కూడా ఏదో ఒక బాధ ఇంట్లో కాపురం చేస్తూనే ఉంటుంది. కాబట్టి ఆ బాధను కాసేపు పక్కన పెట్టి, గురువు అందించే 'బోధను' హృదయంలోకి తీసుకోవాలి. బాధను పక్కన పెట్టడం సాధ్యమేనా అనిపిస్తుంది, కానీ నిద్రపోగానే మనకు ఉన్న బాధలన్నీ తాత్కాలికంగా ఆరు నుండి ఎనిమిది గంటల పాటు మాయమవుతున్నాయి కదా! నిద్రలో ఎవరికైనా బాధలు, భయాలు ఉంటాయా? ఉండవు. నిద్ర అనేది బాధలను పక్కన పెట్టవచ్చు అనేదానికి ఒక సంకేతం. తాత్కాలికంగా నిద్రలో పోయే బాధలను, జ్ఞానంతో శాశ్వతంగా దూరం చేసే అవకాశాన్ని ఇచ్చేవాడే గురువు. మనం చనిపోయేటప్పుడు లేదా జన్మజన్మల ప్రయాణంలో మన వెంట భార్య రాదు, భర్త రాడు, ఆస్తులు రావు, చదువు రాదు. ఏదీ వెంట రాదు కానీ, మన వెంట వచ్చేది ఒక్క 'బాధ' మాత్రమే. ఆ బాధ లోపల కారణ శరీరంలో చేరి, కొత్త దేహం రాగానే మెలుకువతో పాటు మళ్లీ వ్యక్తమవు తుంది. దీనిని సమూలంగా తుడిచిపెట్టేవాడే గురువు. మనసు దక్షిణాయనంలో బహిర్ముఖంగా ఉంటుంది కాబట్టి, దానిని అంతర్ముఖం చేయడానికి దక్షిణాయన ఆరంభంలోనే గురుపూర్ణిమను ప్రసాదించారు.

భార్యాభర్తలను ఇంగ్లీషులో 'బెటర్ హాఫ్' అంటారు, అంటే కేవలం సగం మాత్రమే అర్థమైన స్థితి. ఒకరినొకరు పూర్తిగా అర్థం చేసుకుంటే వారు లౌకిక భార్యాభర్తలుగా మిగలరు, పార్వతీపరమేశ్వరుల వంటి దైవస్వరూపులవుతారు. దేహానికి అనారోగ్యం ఉన్నా, మనసుకు కష్టాలు ఉన్నా కూడా ఆనందంగా ఉండడం సాధ్యమేనని గురువు చెప్తాడు. మనం ఎన్నో ఏళ్లుగా సత్సంగాలు వింటున్నాము, గుళ్లకు వెళ్తున్నాము, భగవద్గీత పారాయణాలు చేస్తున్నాము. కానీ మనకు దేవుడి గురించి ఏ రోజు గుడి తెరుస్తారు, ఏ ప్రసాదం పెడతారు అనే సగం విషయాలే తెలుసు కానీ దైవతత్త్వం పూర్తిగా తెలియదు. పిల్లల మనసు కూడా తల్లిదండ్రులకు పూర్తిగా అర్థం కావడం లేదు. ఆధ్యాత్మికత లేదా జ్ఞానం అంటే పెద్ద పెద్ద మాటలు కావు;

మనకు మన మనసు సగమే అర్థమయింది కాబట్టే మన సంతోషం కూడా సగమే ఉంది. మనం అద్దంలో మొహం చూసుకున్నప్పుడు కేవలం ముందు భాగమే కనిపిస్తుంది, వెనుక భాగం కనిపించదు; అంటే అద్దంలో కూడా మన రూపం సగమే కనిపిస్తుంది. అలాగే మన మనసు మనకు సగమే తెలుసు. ఏ రోజు అయితే నీ మనసు నీకు పూర్తిగా కనబడుతుందో, ఆ రోజు మనసు పూర్ణమైపోతుంది. అదే నిజమైన గురుపూర్ణిమ. మనలోని ఆ అసంపూర్ణమైన సగాన్ని పూర్తి చేసేవాడే గురువు, ఎందుకంటే ఆయన మనలో ఉన్న 'పూర్ణుడు'.

గురువుకు శిష్యుడి భూత, భవిష్యత్, వర్తమాన కాలాలన్నీ తెలుసు. ఆయన లౌకిక జాతకాలు, ప్రశ్నలు చెప్పేవాడు కాదు, కేవలం దండాలు పెట్టించుకోవడానికి పరిమితమైనవాడు అంతకన్నా కాదు. శిష్యుడి మనసు శిష్యుడికి పూర్తిగా అర్థమైనప్పుడే గురువు సంతోషిస్తాడు. ఈ పూర్ణత్వాన్ని సాధించడానికే చాతుర్మాస్యంలో కొంత సమయాన్ని కేటాయించాలి. గురువు అంటే జ్ఞానము, పూర్ణము అంటే మనసే. చదువులో పీహెచ్‌డీ చేసినా, దాని తర్వాత ఇంకో చదువు ఉంటుంది తప్ప ఏదీ పూర్తిగా రాదు. కానీ గురువు మన అంతరంగంలోని అజ్ఞానాన్ని తొలగిస్తాడు. దక్షిణాయనంలో మనసు ఉధృతంగా ప్రపంచం వైపు వెళ్తుంది కాబట్టి, ఆరంభంలోనే గురువును ఆశ్రయించి వినయంతో మార్గాన్ని అడగాలి. అహంకారం వీడి పూర్తిగా శరణాగతి పొందాలి. కష్టాలు వచ్చినప్పుడే జీవితం అంధకారమయంగా అనిపిస్తుంది, కానీ గురు అనుగ్రహం ఉంటే ఆ సగం మనసు కాస్త పూర్ణత్వంలోకి మారుతుంది. మనసు పూర్తిగా ఎరుకలోకి రావడమే జ్ఞానం. గురువుకు చేసే పూజను 'పాదపూజ' అంటారు. పాద అంటే పావు వంతు (కాల్ భాగం) అని కూడా ఒక అర్థం ఉంది. గురువుగారు అనేవారు–ఎప్పుడూ పాదపూజేనా, పూర్ణపూజ (పూర్ణంగా అర్పణ చేయడం) చేయలేరా అని. పూర్ణత్వం అంటే అహంకారాన్ని పూర్తిగా వదిలిపెట్టడం.

జ్ఞాన సాధనకు వయసుతో సంబంధం లేదు. ఏ వయసులో మనసు మొదలైందో, ఆ వయసు నుండే మనసును పూర్ణంగా అర్థం చేసుకోవడం ప్రారంభించాలి. లోకంలో పిల్లల మనసు తెలిస్తే మంచి టీచర్ అవుతారు, రోగి మనసు తెలిస్తే

మంచి వైద్యుడు అవుతారు, అజ్ఞాని మనసు తెలిస్తే మంచి గురువు అవుతారు, భార్య మనసు తెలిస్తే మంచి భర్త అవుతారు. ఇళ్లలో 'మా వారు' అంటుంటారు, 'వారు' అంటే వార్ యుద్ధం (24 గంటలు గొడవ పడడానికి ఒకరు ఉండాలి కదా అని హాస్యోక్తి). ఇవన్నీ పక్కన పెట్టి, మనసు పూర్తిగా అర్థమైతే 'నేనెవరో' తెలుస్తుంది. అష్టకష్టాలు లేదా సినిమా కష్టాలు ఉన్నా కూడా మనసు పూర్ణంగా తెలిస్తే ఆనందంగా ఉండడం సాధ్యమే. అసంపూర్ణంగా ఉండటమే ఆలోచన, అసంపూర్ణతే భావము, అసంపూర్ణతే ధ్యాన సాధన మరియు కర్తృత్వ భావన. గురువును పూర్తిగా అర్థం చేసుకోవాలంటే మన మనసు మనకు పూర్తిగా అర్థం కావాలి. ఎవరైతే మన పట్ల నిష్కల్మషమైన ప్రేమతో ఉంటారో వారే పూర్ణులు. ఉదాహరణకు, తల్లిదండ్రులు పిల్లల విషయంలో 'నా కొడుకు కలెక్టర్ అవ్వాలి, అమెరికా వెళ్లాలి, గ్రీన్ కార్డు రావాలి' అని కోరుకుంటే అది ప్రేమ కాదు, కోరిక మాత్రమే. పిల్లవాడిలో నీ కోరికను చూస్తున్నావు తప్ప, అక్కడ ప్రేమ లేదు. నిజమైన ప్రేమ ఉంటే భవిష్యత్తు గురించి, గతం గురించి ఎలాంటి కోరికలు, నిబంధనలు ఉండవు. అసంపూర్ణతే దక్షిణాయనం, పూర్ణత్వమే ఉత్తరాయణం.

ఆధ్యాత్మిక సాధనలో 'నేనెవరో ఎలా తెలియాలి?' అనేదానికి సమాధానం– నీ మనసు నీకు పూర్తిగా తెలిస్తే చాలు. మనసు సగమే తెలిసింది కాబట్టి మనం శిష్యులుగా, మనుషులుగా ఉన్నాము; అదే మనసు పూర్ణంగా తెలిస్తే ఆ పూర్ణత్వమే గురువు అవుతుంది. గురువు విడిగా ఎక్కడో ఉండడు, మన మనసులోని పూర్ణత్వమే గురువు. గురుపాదుకలు సంసార సముద్రాన్ని దాటించే నౌక లాంటివి, వైరాగ్య సామ్రాజ్యాన్ని ఇచ్చేవి, అజ్ఞానమనే చీకటిని పోగొట్టే సూర్యుడి వంటివి, మూగవానిని కూడా వాచస్పతిగా మార్చగల శక్తి గలవి. ఈ చాతుర్మాస్య దీక్షను ఎలాంటి కోప తాపాలు, ప్రశ్నలు లేకుండా, కేవలం నామస్మరణతో ప్రశాంతంగా గడపాలి. ఈ గురుపూర్ణిమ మనందరి మనసులను పూర్ణం చేసి సంపూర్ణ జ్ఞానాన్ని ప్రసాదించాలని గురుదేవులను ప్రార్థిస్తున్నాను.

ఓం శ్రీ శివానంద గురుభ్యో నమః శ్రీ ఆంజనేయ పరబ్రహ్మణే నమః.

భారత్ మాతాకీ జై!!

శ్రీశివానందగురుభ్యోన్నమః

# భావసారూప్యతే భారతీయత

## మనసుకి ఏకకాలంలో దైవంతోనూ దేశంతోనూ సత్సంబంధమే సనాతనధర్మం

**(ఆర్.ఎస్.ఎస్ శతజయంతి ఉత్సవాలు – కోదాడ ది.19.04.2026)**

**వం**దేళ్లకుపైగా భారతదేశపు సనాతన ధర్మానికి విశిష్ట సేవలను అందిస్తున్న రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వ్యవస్థాపకులు మహనీయ డాక్టర్ హెడ్గేవార్ గారికి, ఆ స్ఫూర్తిని కొనసాగిస్తున్న మహనీయులకు, నేడు ఆ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్న సర్ సంఘ్‌చాలక్ మాననీయ మోహన్ భగవత్ గారికి, దేశవ్యాప్తంగా ఆ స్ఫూర్తిని విస్తరింపచేస్తున్న ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు అందరికీ శతజయంతి ఉత్సవ శభాభివందనలు.

భారతీయ సనాతన ధర్మ పరిరక్షణకు తల్లి ఒడి, బడి, గుడి... ప్రధాన వేదికలుగా నిలవాలన్న ఆర్ఎస్ఎస్ సందేశం అందరికీ శిరోధార్యం. కానీ వాటికి నేడు కలుగుతున్న ప్రధాన అవరోధాలేమిటి, అందుకు మూల కారణాలు ఏమిటి, వాటిని తొలగించుకునే పరిష్కార మార్గాలు ఏమిటి అన్నది మనం కూలంకషంగా చర్చించుకున్నప్పుడే ఆ సందేశాన్ని సాకారం చేయగలుగుతాం. అందుకు ఈ శతజయంతి వేడుకలు వేదిక కావడం మంచి పరిణామం. దేశమంటే సంస్కృతి, సంప్రదాయము. వ్యక్తులలో ఈ భావం కలిగిన వ్యక్తిత్వమే సమాజం. ఈ భావసారూప్యత కలిగిన పౌరులే కుటుంబం. అది వ్యక్తిగత కుటుంబమే కావచ్చు. సమస్త భారతప్రజలే కావచ్చు. ప్రతి మనసుకు స్వతహాగా ఉండే పవిత్రతే దైవీగుణం (పరం). మనసు వ్యవహారంలోకి వచ్చిన తర్వాత సంస్కృతి సంప్రదాయాలతోపాటు ఉపాధికి సంబంధించి నేర్చుకునేదే జీవనం (ఇహం). మనసుకు ఏకకాలంలో ఇహపరాలతో ఉండే సంబంధాన్ని కాపాడు కోవడమే సనాతన ధర్మం (పవిత్రత + శీలత). పరంలో సహజంగా ఉండే పవిత్రతనే భక్తి అంటారు. హృదయ పవిత్రతను చూసుకోవడం కృతజ్ఞత. చూడక పోవడమే కృతఘ్నత. సంస్కృతి సంప్రదాయాలను అనుసరించడం నైతికత. అనుసరించక పోవడం అనైతికత.

ఇహంలో మన పురాణ ఇతిహాస చరిత్రల ద్వారా నేర్చుకొని ప్రతిబింబించే సచ్ఛీలతే దేశభక్తి. ఈ సంస్కృతి, సంప్రదాయల మేళవింపే భారతీయత. ఇహంలో జీవనంలోకి వచ్చిన తర్వాత కలవడం, తెలుసుకోవడం, నేర్చుకోవడం, ఆచరించడం ద్వారా సాగే జీవనంలో సచ్ఛీలత ఉంటే, పరంలో ఉండే మన మనసు సహజ దైవీగుణం మనసుకు అవగాహనలోకి వస్తుంది. ఇహంలోని మన సత్సంబంధాలే పరంలోని పరమాత్మతత్వాన్ని అనుభవంలో ఉండేలా చేస్తాయి. ఒకకాలంలో దేశంలో పరిఢవిల్లిన ఈ భావసారూప్యత కాలగమనంలో పెనుమార్పులకు లోనై నేడు దానికోసం పరితపిస్తున్నది. ఆ మార్పులు మనకు తెలిసినవే. సనాతనధర్మంలోని దైవభక్తిని, దేశభక్తిని వెల్లడి చేయడం కోసమే జ్ఞానులు, మహాత్ములు, దేశభక్తులు సమకాలీకులుగా అవతరిస్తున్నారు. శ్రీరమణభగవానులవారు, శ్రీ కంచి పరమా చార్యులవారు, సద్గురు శ్రీశివానందమూర్తిభగవానులతో పాటు దేశభక్తులుగా అవతరించిన వారే శ్రీహెడ్గేవార్‌జీ. కాలానుగుణంగా ధర్మాచరణలో వచ్చిన మార్పును గమనించిన డాక్టర్ హెడ్గేవార్‌జీ సనాతనధర్మ పునరుద్ధరణ కోసం సంఘటి తత్వం (ఏకాత్మభావన, భావసారూప్యత)తో సాధించాల్సిన ధర్మజీవనం (శీలత), జాతీయభావన (దైవభక్తి, దేశభక్తిలోని ఏకత), క్రమశిక్షణ (ప్రకృతిలోని క్రమత) అనే సూత్రాలతో 1925 విజయదశమి నాడు ఆర్‌ఎస్‌ఎస్‌ని స్థాపించారు. తత్ఫలి తంగా దేశంలో వారు సంకల్పించిన ఎన్నో సత్ఫలితాలను సాధించగలిగారు, నేటికీ సాధిస్తున్నారు.

నేడు భారతీయ జీవనంలో భావసారూప్యత మరింత లోపించిన కారణంగా పరంలోని మన సహజమైన పవిత్రతను, దైవీగుణాలను, దివ్యత్వాన్ని ఎంతగా విస్మరించామో మనందరం గమనించవచ్చు. దీనివల్ల నేటి భౌతిక సుఖసంపదల్లో శాంతి ఆనందాలు ఎలా కొరవడ్డాయో చూస్తే అర్థమౌతుంది. దేహానికి విలువ నిచ్చిన మనసు దైవాన్ని దేశాన్ని విస్మరిస్తుంది. ఒకవేళ విలువనిచ్చినా అది ఆధారపడటమే గాని ఆరాధన కాదు. అప్పుడు ఆ మనసులో స్వీయ ధర్మం స్థానంలో అనుకరణ, అనుసరణ ఆక్రమించుకోవడం ప్రాధాన్యతగా మారుతుంది. దీనివల్ల సంస్కృతి, సంప్రదాయలకు క్షీణత ఏర్పడుతుంది.

జీవనవిధానంలో సంపద, సాంకేతికత మెరుగైనప్పటికీ భావసారూప్యత కనుమరుగైంది. అదే అనేక దుష్పరిణామాలకు కారణమౌతున్నది. నేడు సమాజంలో నెలకొన్న విపరీతాలుగా, వైపరీత్యాలుగా పరిణమిస్తున్నది. ఈ విషయాన్ని ప్రతిఒక్కరూ సింహావలోకనం చేసుకోవాల్సిన సమయం ఇది. తిరిగి జీవనంలో ఏకాభిప్రాయం ద్వారా సచ్ఛీలతను, మన సహజ దైవీగుణాలను గుర్తించగలిగితేనే భారతదేశం విశ్వగురువుగా పరిఢవిల్లుతుందని ప్రతిభారతీయ పౌరుడు గుర్తించాల్సిన సమయం ఆసన్నమైంది. కుటుంబం అంటేనే భావసారూప్యత. భావసారూప్యత పోవడమే అనైతికత. అదే అనైక్యత. అనైక్యతే అశాంతికి కారణం. నేటి సమస్య లన్నిటికీ మూలకారణం. భావసారూప్యతతో మన ఇల్లే దేశమై, మన కుటుంబమే సమాజమైతే దేశమే ఒక ఇల్లుగా, సమాజమే కుటుంబంగా మారుతుంది. దీనినే మనం వసుధైక కుటుంబం అంటాము. ఉమ్మడి కుటుంబానికైనా, వసుధైక కుటుంబా నికైనా భావసారూప్యతే మూలస్తంభం. పరిమితంగా ఉంటే ఉమ్మడి కుటుంబం. విశాలంగా ఉంటే అదే వసుధైక కుటుంబం. రెంటిలోనూ భావసారూప్యతే పరమ ధర్మం.

ఆ భావసారూప్యతే సనాతన ధర్మం. మనసే దైవం, మనసే దేశమన్న ఏకాత్మ భావనే భావసారూప్యత. అంతా సనాతన ధర్మం అనే ఒక కప్పుకిందికి వస్తుంది. అందుకు మన ఇంటి నుండే మానవ సత్సంబంధాలు మెరుగుపడి మన ఆహార, ఆహార్య, వ్యవహారాల ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాల రూపంలో సచ్ఛీలం పరిమళించాలి. మనం ఏ దేశంలో ఉన్నా వ్యక్తిరూపాన్ని, వ్యక్తిత్వాన్ని చూసి మీరు భారతీయులా అని గుర్తించేలా జీవించాలి. కుటుంబ జీవనంలో సచ్ఛీలతను అలవర్చుకోవడం ద్వారా మన హృదయంలోని సహజ పవిత్రతను అవగాహనలోకి తెచ్చుకొని జీవించమని చెప్పే సనాతన ధర్మబోధ తల్లిఒడి నుండి ప్రారంభం కావాలి. అదే బడిలో విలువలతో కూడిన విద్యాభ్యాసంగా, గుడిలో ఉత్తమ సామాజిక జీవనంగా పరిమళిస్తుంది. అమ్మ ఒడి దేశం గురించి చెప్తే, గుడి దైవంగురించి చెప్తుంది. ఈ ఇహపరాలు రెండూ చెప్పేదే నిజమైన విద్య. మానవసంబంధాల్లో అలవర్చుకున్న సచ్ఛీలత దేశభక్తిగా, మనసులోని సహజ పవిత్రత దైవభక్తిగా

పరిఢవిల్లిన దేశం మనది. కానీ నేడు మనసు హృదయ పవిత్రత ద్వారా వచ్చే శాంతి ఆనందాలను విస్మరించి కేవలం భౌతికమైన సుఖశాంతులకే విలువనివ్వడమే సనాతన ధర్మ జీవనానికి విఘాతంగా మారింది. కుటుంబం నుండే మనం సచ్ఛీలత అలవర్చుకుంటే ప్రతిఇల్లు సనాతన ధర్మంతో విలసిల్లే భారతదేశమే అవుతుంది. మార్పుకోసం సమాజంవైపు, దేశంవైపు చూడటం కాకుండా మన ఇంటినుండి ఆ మార్పును ప్రారంభించాలి. కేవలం సుఖసంతోషాలకోసం ఇహంలో పడిపోయి పరాన్ని మర్చిపోయిన మనసుకు శాంతి ఆనందం లభించదన్న సత్యం ప్రతి ఇంటిలో ప్రతిధ్వనించాలి. అది మన ఆహారం, ఆహార్యం, వ్యవహారంలో సంస్కరణగా ప్రతిబింబించాలి. ఎప్పుడైతే కుటుంబ వ్యవస్థలోనే భావసారూప్యత పోయిందో సచ్ఛీలత పోయి పవిత్రత జ్ఞప్తిలోకి కూడారాదు. సచ్ఛీలత, పవిత్రత లేని సమాజం, దేశం జీవంలేని శవంగా ఉంటుంది. ధర్మం స్వరూపజ్ఞానాన్ని తెలుసుకునే నడతను, దేశంలో ఉండాల్సిన నడకను గురించి చెప్తుంది. మతం బాహ్యజీవనంలో నడక గురించి మాత్రమే చెప్తుంది. మతం నువ్వూ...దైవమూ... అని చెప్తుంది. ధర్మం నువ్వే దైవమని చెప్తుంది. జీవనంలోనూ, మతంలోనూ వైవిధ్యం కనపడుతుంది. వైవిధ్యం లేనిదే ధర్మం. కనుకనే మనది భారతీయ సనాతన ధర్మమే కానీ మతం కాదు. తనలోని దివ్యత్వాన్ని తెలుసుకోడానికే సృష్టి ఏర్పడిందని, మనసు ఏకకాలంలో స్వరూపజ్ఞానంగా ఉన్న దైవంతోనూ, జీవనంలోని దైవంతోనూ సంబంధాన్ని కలిగి ఉంటుందన్న పరమసత్యాన్ని చెప్పేదే మన సనాతనధర్మం. నీవు దేహానివి కావు... దైవమే నువ్వు, ఈ ప్రపంచం నువ్వు వేరు కాదు అని చెప్పే ఈ విశిష్ట ధర్మం ఈ భారతావనిలోనే విలసిల్లింది. దేహమే దేవాలయం, జీవుడే సనాతన దైవం అని బోధించే మన ధర్మం యొక్క ఉద్దేశం ప్రతి హృద్దేశంలో ఉంటే ప్రతి కుటుంబం దేశభక్తికి, దైవభక్తికి నిలయమై ఈ భారతావనిలో పుట్టి ఈ నేల, ఈ గాలితో చరించడమే పరమ ధన్యతగా భావించే ఉత్తమోత్తమమైన భావం మనసుకు కలుగుతుంది. అప్పుడు ఈ దేశమంతా వసుధైక కుటుంబంగా పరిఢవిల్లుతుంది. అందుకే సద్గురు శ్రీశివానందమూర్తి భగవానులవారు ఆసేతు హిమాచలం ఈనేలపై దొర్లాలని ఉందని సెలవిచ్చేవారు. వ్యక్తిగత జీవితంలో సచ్ఛీలం లేకుండా సమాజంలో దేశంలో

మార్పును కోరటం వేరును మరిచి చెట్టు ఆకులకు నీరు పోయడం లాంటిదే. దేశంలో, ప్రపంచంలో జరుగుతున్న తీవ్ర పరిణామాలను ప్రత్యక్షంగా చూస్తున్న మనం సనాతనధర్మ పునరుద్ధరణ ఆవశ్యకతను తెలుసుకొని భారతీయత యొక్క ఉద్దేశాన్ని మన హృద్దేశంలో నిలుపుకుంటే మనందరం కలలుకనే భావసారూప్యత ధర్మనిష్ఠ, ధర్మదృష్టి కలిగిన రామరాజ్యాన్ని త్వరిత కాలంలోనే వీక్షించగలుగుతాము. అలాంటి రోజులు సమీప భవిష్యత్ లోనే 2032 నాటికి సాకారమవ్వాలని సద్గురు దేవులను ప్రార్థిస్తూ....

సద్గురు శ్రీశివానంద భగవానుల అనుగ్రహంతో, డాక్టర్ శ్రీహెడ్గేవార్‌జీ ఆశీస్సులతో తప్పక ఫలవంతం అవుతుందని విశ్వసిస్తూ....

భారత్ మాతాకి జై!

**మీ... గెంటేల వెంకటరమణ**

శ్రీగురుధామ్ ధర్మక్షేత్రం, బలుసుపాడు



శ్రీ గురుధాం ధర్మక్షేత్రంలో జరిగే సద్గురు జన్మ (రేవతి) నక్షత్ర హోమంలో పాల్గొన్న శివశ్రీ రమణ గురుదంపతులు, శ్రీ ఆనంద శంకర్ దంపతులు

# సనాతన ధర్మాచరణకు ఏకాదశ సూత్రాలు

(1) దైవం అంటే దైవీగుణాలు. మనసు అంటే మనుష్య గుణాలు. మనిషి మర్చిపోయిన మౌలిక గుణాన్ని గుర్తు చేయడానికి వచ్చిన వారే మహాత్ములు. మహాత్ముల ఆశయం ఒక్కటే. మనలో లోపించిన ఆ మౌలికగుణాన్ని గుర్తుచేసి, మనతో ఆచరింపచేసి, మనకు క్షేమంకరమైన సార్థక జీవితాన్ని అందించడమే. మహాత్ములు దైవాన్ని దర్శించి దానికి బాహ్యరూపమైన ధర్మాన్ని చెప్పారు. దేశభక్తులు బయట ధర్మాన్ని గుర్తించి ఆచరించండి అది దైవదర్శనంగా మారుతుంది అని చెప్పారు. ఇద్దరు చెప్పిందీ ప్రమాణమే.

(2) దైవమే సృష్టిగా ఉంది. పంచభూతాల్లోని ప్రేమ ద్వారా అనంత జీవరాశి పొందే ఫలమే స్థితి. సృష్టికి లయం లేదు. మనలోని ప్రేమగుణం లయం కావడమే సమస్త జీవరాశికి అందాల్సిన సృష్టి ఫలాలను లయం చేస్తుంది.

(3) ఏకకాలంలో అంతరంగంలోని దైవంతో, బాహ్యంలోని దేశంతో అవినాభావ సంబంధం కలిగి ఉండమని చెప్పే మన సనాతన ధర్మ సారాంశం సదా మన హృదయంలో నిలుపుకోవడమే ఆధ్యాత్మికత. మంచినీళ్లలో దాహం తీర్చే మౌలిక గుణంతో పాటు దివ్యత్వం కూడా ఉందని గ్రహించే శక్తి ప్రేమలో, సేవలో ఉంది. సృష్టిలో ఉన్న ధర్మాన్ని, దివ్యత్వాన్ని గుర్తించిన దేశం భారతదేశం.

(4) గుణం ఉపయోగం అయితే మన శీలమే యోగం. పరమాత్మను గుణంతో గుర్తుపడతాం, శీలంతో గ్రహిస్తాం, దర్శిస్తాం. పశుపక్ష్యాదులలో, వృక్షాల్లో వ్యక్తమయ్యే ఆ పరమాత్మ ప్రేమ స్వభావం తనలో కూడా చూసినప్పుడు అది యోగం అవుతుంది.

(5) సేవ దైవీగుణం. సేవాసంఘం అంటే ఆ సేవాగుణం కొనసాగే సమూహం. అది ఒక వర్గానికి సంబంధించిన మాటకాదు. అందరిలో ఉన్న ఆ పరమాత్మ గుణాన్ని తట్టిలేపేది. వేదంద్వారా మనలోని దివ్యత్వాన్ని చెప్పడానికి మహర్షులు వచ్చినట్లే మనలోని ప్రేమ, సేవ, సౌశీల్యత అనే పరమాత్మ దైవీగుణాన్ని గుర్తు చేయడానికి దేశభక్తులు అవతరిస్తారు.

(6) మన దేశంలోని సనాతన ధర్మంలో వ్యక్తి ఆరాధన ఉండదు. ఉన్నత

వ్యక్తిత్వంగా ఉండే పరమాత్మ తత్త్వాన్ని ఆరాధించడమే ఉంటుంది. అది మనసులో కొత్తకొత్త ముద్రలను కల్పించదు. ఉన్న ముద్రలను తొలగిస్తుంది.

(7) మనసుకు పంచేంద్రియాలతో సంబంధం ఉన్నట్లే మన జీవితానికి ఈ పంచశీలాలతో సంబంధం ఉంది. అది గుర్తుచేయడానికే వేదాలు మొదలు పురాణ ఇతిహాసాలు ప్రయత్నిస్తాయి. దాన్ని నేటి సమాజానికి అవసరమైన రీతిలో అందించే ఆధునిక వేదమే నేడు ఆర్ఎస్ఎస్ ద్వారా జరుగుతున్న సమాజ సంస్కరణ ఉద్యమం.

(8) మన సనాతనధర్మంలోని ఆ మౌలికగుణం అనే తీగకు మనమంతా పందిరి కావాలి. ఆ తీగను పందిరిని కలిపే సద్భోధ అనే తాడు అవసరం. అలాంటి పాత్రను పోషించే ఆర్ఎస్ఎస్ వంటి సేవాసంస్థలను మనమంతా ఆదరించాలి.

(9) ఎప్పుడైతే సృష్టిలోని మౌలిక ప్రేమగుణం మనిషిలో లోపిస్తుందో సహజ సేవాభావం కనుమరుగై అది లయం అవుతుంది. అదే ప్రకృతిలోకూడా క్షీణిస్తే అది విలయంగా, ప్రళయంగా పరిణమిస్తుంది.

(10) మనం మనసుతో, కుటుంబంతో, సమాజంతో, ప్రకృతితో, దైవంతో ప్రవర్తించే మన శీలం మన మౌలికగుణంగా ఉండాలి. సనాతన ధర్మం యొక్క ఉద్దేశం మన హృద్దేశంలో ఉన్నప్పుడే అది ఈ పంచక్షేత్రాల్లో వర్తించి అది హృదయ నర్తనంగా మారుతుంది. బంధుత్వం విషయంలో మనది రక్తసంబంధమైతే సమాజంతో ఉండే బాంధవ్యం విషయంలో మనది భక్తసంబంధం అని తెలుసు కోవాలి. సేవాగుణం, భావసారూప్యత కలిసిందే ఈ భక్తసంబంధం.

(11) గుణం భౌతికం... శీలం అధిభౌతికం... ఏకకాలంలో దైవాన్ని తనలోనూ, సృష్టిలోనూ చూడగలిగిన ఆ ధర్మశీలాలే మన సనాతన ధర్మం. సత్యం తనలోనూ ఉందని, 'స'త్యానికి 'నా' 'తన' బేధం లేదని చెప్పేదే సనాతన ధర్మం. అందుకే ఇతర అన్ని మతాలు దైవం విడిగా ఉన్నాడని చెప్తాయి. సృష్టి అంతటా ఉన్న దైవం నీలో ఉందని చెప్పేదే మన సనాతన ధర్మం. పరమాత్మ స్వరూప స్వభావాన్ని గుణంగా బయట చూడటానికి ధర్మదృష్టి, దివ్యత్వంగా నీలో చూడటానికి శీలం కావాలి.

మహాత్ముల ఆశీస్సులతో మనందరిలో సనాతనధర్మం పరిఢవిల్లాలని ప్రార్థిస్తూ....


– **గెంటేల వెంకటరమణ,** శ్రీగురుధామ్ ధర్మక్షేత్రం, బలుసుపాడు.

## జీవనం లౌకికం - విరామం ఆధ్యాత్మికం

### శ్రీ జిడ్డు కృష్ణమూర్తిగారి వ్యాఖ్యానాలపై శివశ్రీ రమణ గురుదేవుల విచారణాసారం

### ది.23.06.26, మంగళవారం శ్రీగురుధామ్ ధర్మక్షేత్రం, బలుసుపాడు

# ఆనందంకూడా పరపతి, హోదా లాంటిదేనా?



సద్గురు శ్రీ జిడ్డు కృష్ణమూర్తిగారి మన జీవితాలు పుస్తకంలోని ఒక అధ్యాయం ద్వారా వారిజీవితంలో జరిగిన ఒక సంఘటనను పరిశీలిస్తే, ఒకానొక సందర్భంలో ఒక మంత్రిగారిని ఆయన వద్దకు తీసుకువచ్చారు. ఆ మంత్రి గారికి ఈ ఆధ్యాత్మిక విషయాలపై పెద్దగా ఆసక్తి లేకపోయినప్పటికీ, ఆయన ఎంతో మాటకారి, సమాజంలో ఉన్నత హోదాలో ఉన్న వ్యక్తి. ఆయన కృష్ణమూర్తి గారి ముందు తన మనసులోని ఒక పెద్ద వేదనను చెప్పుకున్నారు. తాను చేసే పనుల్లో ఎప్పుడూ వైరుధ్యం ఎదురవుతుందని, తాను అందరికీ సహాయపడాలని ప్రయత్నించినప్పటికీ, చివరికి ఆ సహాయం పొందిన వారితోనే విరోధం వస్తోందని చెప్పారు. ఒక చేత్తో ఇస్తూనే మరో చేత్తో గాయపరిచే స్వభావం తనలో ఎన్నో ఏళ్లుగా ఉందని, ఈ సమస్యను తాను స్వయంగా అర్థం చేసుకోలేకపోతున్నానని ఆయన వాపోయారు. అప్పుడు కృష్ణమూర్తి గారు ఎంతో సహేతుకంగా స్పందిస్తూ, ఇక్కడ సమస్య మీరు చేసే పనిలో లేదు, పైకి లాభదాయకంగా కనిపిస్తూ లోలోపల హానిని, బాధను కలిగించే మీ అంతర్గత ఉద్దేశంలోనే సమస్య ఉందని చెప్పారు. ఎందుకంటే, ఒక పనిని మీరు ఇష్టపడుతున్నారంటే మీకు నిజంగా ఆసక్తి ఆ పని మీద కాదు, ఆ పని ద్వారా మీకు లభించే లాభంపైనే దృష్టి ఉండటమే ఇందుకు కారణం. కీర్తి, సమాజంలో వచ్చే పరపతి మరియు హోదాలాగానే ఆనందాన్ని కూడా పొందాలని అనుకుంటున్నారు. ఆ బాహ్య ప్రయోజనాల ద్వారా మీరు ఆనందాన్ని పొందాలను కోవడమే అసలైన సమస్య అని ఆయన స్పష్టం చేశారు.

మనం చేసే లౌకిక పనుల వెనుక ఉన్న నిజమైన మన ఉద్దేశాన్ని అర్థం చేసుకున్నప్పుడే నిజమైన శాంతి ఉంటుందని దీని అర్థం.

శ్రీ కృష్ణమూర్తి గారి దగ్గరకు వచ్చే వంద మందిలో తొంభై మంది ఇలాంటి నిత్య జీవిత సంఘర్షణలు, అశాంతి, దుఃఖం, అసూయ, ద్వేషం వంటి అరిషడ్వర్గాలకు సంబంధించిన సమస్యలనే అడిగేవారు. కానీ శ్రీకృష్ణస్వామివారు చెప్పే సమాధానాలన్నీ నిత్య జీవితానికి సంబంధించినవిగా కనిపిస్తూనే, అంతర్గతంగా శుద్ధ అద్వైతాన్ని బోధించేవిగా ఉండేవి. సద్గురు శివానంద భగవానుల వారు కూడా భాగవతం, రామయణం, భారతం వంటి పురాణ కథలు చెప్పినా, కృష్ణుడిని లేదా రాముడిని గురించిన సంప్రదాయాలను వివరించినా, మనం ఈ సంసార జీవితంలో జీవిస్తూనే ఆ పరమ సత్యాన్ని ఎలా చేరుకోవాలో, ఎలా ఆ సత్య స్వరూపమై  ఉన్నామో తెలియజెప్పేవారు. అందుకే శివానంద భగవానుల వారు నా సంకల్పమే నా తపస్సు అంటూ దేశభక్తికి అత్యంత విలువను ఇచ్చారు. మన సామాన్య సంసార జీవనము, ఆధ్యాత్మిక జీవనము మరియు దేశభక్తి అనేవి వేర్వేరు కాదని, ఈ మూడూ పరమేశ్వరుని త్రినేత్రాల లాగా కలిసి ఉండే ఒకే ఒక్క త్రిపుటి అని వారు ప్రబోధించారు. సమాజ సేవ చేయడం ద్వారా కూడా గమ్యాన్ని చేరవచ్చని, అది కూడా ఒక అద్భుతమైన దివ్య జీవనమని మహాత్ములు నిరూపించారు. లోకంలో చాలా మంది తాము ఎంత చేసినా ఇతరులలో తృప్తి లేదని, తాము అందరికీ శత్రువులమైపోతున్నామని బాధపడుతుంటారు. మనస్ఫూర్తిగా చేసినా, అయిష్టంగా చేసినా ఒక్కోసారి నిందలే మిగులుతాయి. మరికొందరు మాట కఠినంగా ఉన్నా మనసు వెన్నలా ఉండి మంచి చేస్తుంటారు. ఈ గందరగోళం నుండి బయటపడాలంటే మన దృష్టిని పని యొక్క ఫలితం గురించిన మన అంచనాలు, అభిప్రాయాలపైన కాకుండా వాస్తవంపైనే నిలపాలి. బాహ్యంగా జరిగే పనులు స్థూలమైతే, లోపల ఉండే భావాలు సూక్ష్మమైనవి. స్థూల సుఖాలు శరీరానికి మాత్రమే పరిమితం. ఉదాహరణకు ఒక మెత్తటి సోఫాలో కూర్చుంటే శరీరానికి సుఖం కలుగుతుంది, ఆ స్థితిని చూసి మనస్సుకు సంతోషం

కలుగుతుంది. కానీ ఆత్మకు కలిగే ఆనందం వీటన్నింటికీ అతీతమైనది. సంతోషం వల్ల గానీ, భౌతిక సుఖాల వల్ల గానీ ఆత్మకు కొత్తగా ఆనందం రాదు, ఎందుకంటే ఆత్మ స్వతహాగానే ఆనంద స్వరూపం. ఈ సత్యాన్ని మర్చిపోయి మనస్సు బాహ్య వస్తువులకు ఆనందాన్ని ఆపాదిస్తూ ఉంటుంది. దీనికి భిన్నంగా అమ్మ ప్రేమను చూడవచ్చు. తల్లి పాడే జోలపాట పసిపాపకు పాలకన్నా తీపిగా ఉంటుంది. ఆ జోలపాట వింటుంటేనే బిడ్డకు తెలియని ఒక అలౌకిక ఆనందం కలుగుతుంది, ఎందుకంటే అక్కడ భౌతికమైనది గానీ, మానసికమైన కల్మషం గానీ ఏదీ ఉండదు. తల్లి ప్రేమ అనేది స్వచ్ఛమైన ఆనందానికి ప్రతిరూపం. జ్ఞానులు ఈ విషయాన్ని గ్రహించి, ప్రాపంచిక వస్తువులలో ఆనందం లేదని, అది కేవలం మన ఆత్మ యొక్క సహజ స్థితి అని తెలుసుకుంటారు. పుట్టుకతోనే చెవుడు ఉన్న ఒక చంటిబిడ్డకు వైద్యులు మిషన్ పెట్టగానే, మొదటిసారి తల్లి గొంతు విని ఆ పాప పొందిన ఆనందం, ఆ తల్లి కళ్లలో కురిసిన ఆనంద బాష్పాలు ఎక్కడి నుండి వచ్చాయో గమనిస్తే, అది కేవలం ఆత్మ యొక్క అనుభూతి అని అర్థమవుతుంది. కడుపులో ఉన్నప్పుడే తల్లి గొంతు వినే బిడ్డ, ఈ సృష్టిలోకి రాకముందే వినే మొదటి గొంతు ఈశ్వరుడిది లేదా సద్గురువుది. గురువుతో ఉన్న బంధం అంతటి ప్రాచీనమైనది, వైభవమైనది. మనం నిద్రపోయేటప్పుడు పడక సరిగ్గా లేకపోతే శరీరానికి సుఖం ఉండదు, కానీ గాఢనిద్ర పట్టినప్పుడు లభించే ఆనందం ఏ భౌతిక వస్తువు వల్ల వచ్చింది కాదు. మేల్కొన్న తర్వాత ఆ నిద్రలో పొందిన ప్రశాంతతను మనం జాగ్రత్తగా గమనిస్తే ఆత్మ స్థితి అర్థమవుతుంది. జ్ఞాని ఎప్పుడూ ఆ ఆనందం విషయంలో ఎరుక కలిగి మెలకువలో ఉంటాడు, పసిబిడ్డ మనస్సు ఎదగకముందు ఆ దివ్యత్వంలో ఉంటాడు. లోకంలో కుడిచేత్తో చేసే దానం ఎడమచేతికి తెలియకూడదు అనడంలో అంతరార్థం ఏమిటంటే, నువ్వు భౌతికంగా చేసే ఏ మంచి పనినైనా మనస్సుకు ఆపాదించి దానికి కీర్తి, ప్రతిష్టలను ఆశించవద్దని. చివరికి ధ్యానం కూడా పుట్టలో పాములాగా ఎవరికీ తెలియకుండా అత్యంత గంభీరంగా సాగాలి. సద్గురు శ్రీ శివానందమూర్తి భగవానుల వారు చెప్పారు.... శ్రీకృష్ణమూర్తి గారి సన్నిధిలో వేల మంది ఆత్మోద్ధారణ పొందినప్పటికీ,

వారు ఎన్నడూ తమను తాము గొప్పగా ప్రకటించుకోలేదు. సద్గురుమూర్తి సన్నిధిలోనూ అనేకం జరిగినా వారు ఎప్పుడూ రోడ్డు పక్కన ఉండే ఒక సామాన్య మానవుడి కంటే సామాన్యంగా జీవించారు. ఒక లగ్జరీ కారులో ప్రయాణించి క్షేమంగా గమ్యం చేరినప్పుడు మనం ఆ ప్రయాణ సౌకర్యాన్ని అనుభవిస్తాం కానీ దానికంటే అప్పుడు కలిగిన మానసికమైన హోదా, పరపతిని మనసులో అభిప్రాయంగా ముద్రించు కుంటాము. భౌతికంగా కారు ఇచ్చిన సుఖం దేహంద్వారా మనసుకు తెలిసింది. దీన్ని వదిలి మనసులోని అభిప్రాయాలు, అంచనాలు, ఊహలకు విలువనివ్వడమే పెద్ద సమస్యగా మారుతుంది. ఇది అర్థమైతే మనసులోని అభిప్రాయాలను పట్టుకొని కూర్చోము. మన జీవితంలో ఎదురయ్యే అనుభవాల వెనుక ఉన్న పరమ సత్యాన్ని గ్రహించాలే తప్ప, మన వ్యక్తిగత అభిప్రాయాలకే విలువ ఇస్తూ కూర్చుంటే అసలు విషయం అదృశ్యమైపోతుంది. మనస్సుకు అసలు రూపమే లేదు, నామమే లేదు. ఉనికి లేని మనస్సును ఏకాగ్రం చేయాలని, దానికి భక్తిని అలవరచాలని, దాన్ని కట్టడి చేయాలని ప్రయత్నించడం పరిధి లేని దానికి హద్దులు పెట్టాలని చూడటమే అవుతుంది. నిజంగా లేని మనసు ఒక నీడలాంటిది. దానికి ఏదో అలంకరించాలని చూడటం సాధ్యమౌతుందా? ఈ జగత్తు అంతా ఒక గాలి బుడగ లాంటిది. ఈ శూన్యతను, అనిత్యత్వాన్ని పూర్తిగా తెలుసుకున్నప్పుడే మనకు నిజమైన జ్ఞానం సిద్ధిస్తుంది. సద్గురు శివానంద భగవానుల వారు ఒకసారి బోధిస్తూ, నీకు లోకంలో ఎంతటి కీర్తి ప్రతిష్టలు వచ్చినా, నిన్ను ఒక జ్ఞానిగా లేదా యోగిగా భావించి గౌరవించినా అది నాలుక గీసుకోడానికి కూడా పనికిరాదన్నారు. దేనికీ అహంకరించకుండా వదిలివేయడమే ప్రథమ సందేశం అని చెప్పారు. ఎందుకంటే ఆత్మ మాట్లాడదు, దేహం జడం, కానీ ఈ రెండింటి మధ్య ఏర్పడిన మనస్సు మాత్రమే లేని గొప్పదనాన్ని తనకు ఆపాదించుకొని సంపాదన కోసం గోల పెడుతుంటుంది. రమణ మహర్షి బోధించిన శరణాగతి మార్గం కూడా ఇదే. లేని మనస్సుకు ఉనికే లేదని అర్థం చేసుకుంటే అది సృష్టించే నేను అనే అహంకారాన్ని పూర్తిగా తుడిచిపెట్టవచ్చు. లౌకిక జీవితం, పారమార్థిక జీవితం అని రెండు వేర్వేరు జీవితాలు లేవు. మనస్సు విరామంలో ఆధ్యాత్మికతగా ఉంటుంది.

లౌకిక కార్యక్రమాల్లో ఉన్నప్పుడు జీవనంగా ఉంటుంది. సుఖానుభవాన్ని ఈ రెండింటినీ సమన్వయం చేసుకుంటూ, ప్రతి పనిలోనూ ఆత్మ తత్వాన్ని దర్శించడమే మహాత్ములు మనకు అందించిన పరమ పవిత్రమైన జీవన విచారణ. ఈ అద్భుతమైన సత్యాన్ని గ్రహించి అలా జీవించడమే మానవ జన్మకు సార్థకత.

**ముఖ్యాంశాలు :** భౌతిక విషయాలతోనూ, మానసికమైన అనుభూతులతోనూ ఎటువంటి సంబంధం లేకుండా సదా సర్వకాల సర్వావస్థల్లో (సత్ చిత్ ఆనందంగా) ఉండేదానికే నిజమైన ఆనందమని పేరు. సాధారణంగా మన నిత్య జీవితంలో ఎదురయ్యే అతి పెద్ద సమస్య ఏమిటంటే, లోకానికి ఎంత మంచి చేసినా కూడా చివరికి అందరికీ శత్రువులమైపోతున్నామనే ఒక వేదన ప్రతి ఇంట్లోనూ, ప్రతి ఒక్కరిలోనూ వినబడుతూ ఉంటుంది. ఈ సందర్భంలోనే శుద్ధ అద్వైతం యొక్క ప్రాధాన్యతను మనం గ్రహించాలి. భౌతిక జీవనంలో ఆధ్యాత్మికతను చూడటం అద్వైతమైతే, ఆధ్యాత్మిక జీవితంలో భౌతిక జీవితాన్ని కూడా భాగముగా చూడటమే శుద్ధ అద్వైతము. ఈ రెండింటి మధ్య ఎటువంటి తేడా లేదు, రెండు ఒకటే అనడమే మహనీయుల బోధనల సారాంశం. మానవ జీవితాన్ని లోతుగా పరిశీలిస్తే శరీరానికి లభించేది సుఖము, మనస్సుకు కలిగేది సంతోషము లేదా దుఃఖము అని అర్థమవుతుంది. అయితే, ఈ మనస్సు మరియు శరీరం పొందిన సుఖాను భవాన్ని, సంతోషానుభూతిని కలిపి మనం ఆనందంగా భావిస్తుంటాం కానీ, నిజానికి ఆత్మ స్థితికి, ఉనికికి ఉండే పరమ ప్రశాంతతే అసలైన ఆనందం. ఒకవేళ ఆ ఆనందం భౌతికంగా, సగుణంగా వ్యక్తమైతే అది అమ్మ నాన్నల రూపంలో ఉంటుంది, అదే నిర్గుణంగా ఉంటే అది గురువు లేదా దైవంగా భాసిస్తుంది. ఈ ఆనందాన్ని అనుభవించే తీరులో మనుషుల మధ్య వ్యత్యాసాలు ఉంటాయి. పసిబిడ్డలు ఎటువంటి ప్రాపంచిక విషయాలను ఆపాదించుకోకుండానే సహజంగా ఆనందాన్ని పొందుతారు, పెద్దవాళ్ళు ఏదైనా ఆపాదించి లేదా సంపాదించి ఆనందించాలని చూస్తారు, కానీ జ్ఞానులు మాత్రం ఆనందం యొక్క మూలాన్ని చక్కగా అర్థం చేసుకొని ఎల్లప్పుడూ ఆనంద స్వరూపులుగానే ఉంటారు.

భారత్ మాతాకి జై!

శ్రీ శివానంద గురుభ్యో నమః

# ఇది తెలిస్తే కష్టాలు ఉండవు

## నిసర్గదత్త మహరాజ్ బోధనపై శివశ్రీ రమణగురుదేవుల విచారణ (28.6.26)

## (శ్రీ నిసర్గదత్త మహారాజు వారితో 'ధ్యానములు' అనే పుస్తకంలో 125వ చాప్టర్)

"**త**న చైతన్యమును గమనించుచు తనను తాను మరిచిన వాని యొక్క కష్టములన్నియు తీరిపోవును. తన నిజతత్వం యొక్క పవిత్ర దర్శనముతో వారు పవిత్రముగా మారెదరు. సహజముగానే అతడు ఇతరులకు సహాయకారి అగును. తాను ఇతరుల కంటే వేరుగా లేనని అతను ఎరుగును. ఆత్మ యొక్క పవిత్ర దర్శనమే ఆత్మ వ్యక్తమగుట. ఎవరు ద్వేషమును కలిగి ఉండెదరు? ఎవరి పట్ల ద్వేషమును కలిగి ఉండెదరు? తన స్వీయ ఆత్మకు భక్తుడైన వాడు అందరిలోనూ జీవుడు తానే అవును. చైతన్యముగా జీవించుము, ఇతరులను వ్యక్తులుగా భావించకుము. నీ ఆత్మకు నీవు ఎటువంటి విలువని ఇచ్చెదవో అదే నీ నిజమైన విలువ. ఇతరులను ఆత్మ యొక్క విలువతో చూడుము. ఎవరు ఇక్కడికి వచ్చెదరో వారు వారి అంతరంగంలో దైవం యొక్క ప్రేరణతో ఇక్కడికి వచ్చెదరు. ఎవరికి ఇది ఆఖరిజన్మో వారు మాత్రమే ఇక్కడికి వచ్చెదరు. అన్యజీవులను నీ యొక్క ఆత్మగానే భావించు. ఆత్మ కన్నా వేరు దైవము ఉండును అను భావమును అంగీకరించవద్దు. నీ యాచకత్వమును, యాచించు స్వభావమును వదిలి నేను ఆత్మనని భావించు, నీ ఆత్మ యొక్క నిజతత్వమును పూజింపుము, తన నిజ చైతన్య మును గమనించుచూ తనను తాను మరిచిన వాని యొక్క కష్టములన్నియు తీరి పోవును" అని.

తన చైతన్యమును గమనించుచు ఉండటమే ఇక్కడ సాధన. మనకి 'నేనున్నాను' అన్న ఎరుక వల్లే మనం ఉన్నట్టు మనకి తెలుస్తుంది. మెలుకువ రాగానే మనం మనకి పరిచయంలోకి వస్తాం. అదే 'నేనున్నాను' ఎరుక అంటే. నేనున్నాను ఎరుక అని ప్రత్యేకంగా దాని మీద మనసు పెట్టక్కర్లేదు, నేనున్న ఎరుక అంటేనే మెలుకువ. అది, ఇది వేరు కాదు. మీకు మీరు తెలుస్తున్నారుగా, మీరు ఉన్నట్టు మీకు తెలియటం

అంటే ఏంటి చెప్పండి? ఒక వ్యక్తి అక్కడ కనపడ్డాడు, ఉన్నట్టు తెలుస్తుంది అంతే, తెలుసుకుంటూ ఉండటం అనేది ఏముండదు. అట్లానే మనకి మనం పరిచయంలోకి వస్తాం మెలుకువ రాగానే, దాన్నే భగవాన్ 'మనోమూలము' అని అంటారు. మనసుకు మూలం అది. మీకు మెలుకువ వచ్చిన తర్వాత కదా అన్ని పనులు, అన్ని ఆలోచనలు, అన్ని కోరికలు, పూజలు, పునస్కారాలు ఇవన్నీ జరిగేది? అప్పుడే కదా మనసు వచ్చేది. ఇక్కడ మనసు ఏమిటి, భావం ఏమిటి, ఎరుక ఏమిటి అంటే... మెలుకువ రాగానే మనకి మనం పరిచయంలోకి వస్తాం, మనం ఉన్నట్టు మనకు తెలుస్తుంది. నిద్రలో మనం ఉన్నట్టు మనకు తెలుసా? మెలుకువ రాకుండానే నాకు నేను తెలుస్తున్నా అంటే అది నేనున్నాను ఎరుక. ఎప్పుడైతే మనకి మనం ఉన్నట్టు తెలుస్తుందో ఇక అన్ని కోరికలు వస్తాయి, పనులు వస్తాయి. దాని పేరు మనసు. మెలుకువ వచ్చాక చేసే జీవన కార్యాలకి మనసు అని పేరు, ఇంక మనసని వేరే చూడకండి. అందులో నేను, నాకు, నాది, నీది, నువ్వు ఇవన్నీ ఉంటాయి. మెలుకువ వచ్చాక బాత్‌రూమ్ వెళ్ళాలనిపించడం పేరే మనసు. నిద్ర లేచాక టైం చూసుకుంటారు. ఆ టైం చూడటాన్ని మనసు అంటారు, లేవటాన్నేమో ఎరుక అంటారు. అంటే టైం చూడాలని, ఉద్యోగానికి వెళ్ళాలని, పని చేయాలని, పెళ్లి చేసుకోవాలని, ధ్యానం చేసుకోవాలని, పూజ చేయాలని ఇలా... ఎరుక వచ్చాక చేయవలసిన పనులు గుర్తొస్తాయి, దానికి మనసు అని పేరు. అంటే మీ పనులన్నీ మీరు మర్చిపోవడం, మిమ్మల్ని కూడా మరచిపోవడమే మనసు పోవటం. ఎరుక. మనసు వేరు వేరు కాదు, సంబంధంలోకి వస్తే మనసు అని పేరు, సంబంధం రాకపోతే శుద్ధ ఎరుక అని పేరు, దాన్నే శుద్ధ ఆత్మ అన్నారు. తననుతాను చైతన్యమునుగా గమనించడం అంటే నేను ఎరుకనే కానీ మనసును కాదు అని తెలుసు కోవడం. మనసు లేదని ఎందుకు అంటున్నారంటే... పని ప్రారంభంలో ఎప్పటికప్పుడు అది మనసుగా పిలవబడుతుంది, తర్వాత విరామంలో మనసన్న ధ్యాస ఉండదు. మీరు నిద్రపోతున్నప్పుడు దేహం ఉందా, ప్రపంచం ఉందా, పోనీ మీరు ఉన్నారా? ఏం లేదు కదా! "ఏం లేదండి నాకు నిద్రలో" అని అంటున్నారుగా, ఏమీ లేనితనం ఉనికి అయితే, ఆ ఏం లేదు అనేవాడు ఒకడు ఉన్నాడుగా, వాడే మనసు. కానీ ఒక పారమార్థిక సత్యంలో ఉన్నది మాత్రమే

ఉంటుంది, ఉంచుకున్నదే పోతుంది. నేను ఎవరో తెలియాలి అనేవాళ్ళు, నేను కానిది ఏమిటో తెలుసుకోండి ఫస్ట్, మనసుని తెలుసుకోండి, ఆత్మ అదే తెలుస్తుంది. మీకు నిద్రలో ఏం తెలియదు అంటున్నారు కదా, తెలియందంతా శుద్ధఎరుక, తెలిసిందంతా మనసే. అలలు లేకుండా సముద్రం ఉంటుంది కానీ, సముద్రం లేకుండా అలలు ఉండవు. తెర లేకుండా చిత్రం ఉండదు కానీ, చిత్రం లేకుండా తెర ఉంటుంది. అట్లా 'నేను'కి తప్పనిసరిగా ఈ ప్రపంచంతో సంబంధం ఉండాలని ఏం లేదు. నిద్రలో ఎందుకు లేదు మరి? ఉండాలని ఏం లేదు, ఉండదు కూడా. ఆ ఉండకపోవటమే సత్‌గా ఉన్న దైవం, ఉండటమే చిత్‌గా ఉన్న దైవం, ఏది ఉందో అదే దైవం కానీ నువ్వు ఉంచుకున్నది కాదు. మనకి అవసరం అనేది ఒకటి ఉంది, కోరిక అనేది ఒకటి ఉంది, సహజం అనేది ఒకటి ఉంది. ఆకలి, నిద్ర ఇట్లాంటివన్నీ సహజాలు. సహజానికి తినటం అనేది అవసరం. కానీ నాకు పరమాన్నమే కావాలి, ఫ్రైడ్ రైస్ కావాలి, ఆవకాయ బిర్యానీ కావాలంటే అది కోరిక అని అన్నారు. సహజంగా ఈశ్వరుడితో జరిగేది ఒకటి మనం గమనించం. ఇప్పుడు మనం ఉన్నాం, ఒక అరగంట తర్వాత ఎక్కడో వెళ్తున్నాం, పెద్ద యాక్సిడెంట్ మిస్ అవుతుంది. మనకి ఏం జరుగుతుందో మనకి తెలుసా? ఆ యాక్సిడెంట్ టైంలో అడగటం తెలుస్తుందా? అందులో ఒకటి అయిపోతాం, కానీ ఒకవేళ రక్షించబడ్డాం అనుకోండి ఏమంటాం– దయ అంటాం. అంటే దయ అంటే నువ్వు అడిగిన తర్వాత వచ్చిందా? తెలిసినవాడు అడగముందే చేస్తాడు. అడగకుండానే చేసేవాడిని ఈశ్వరుడు అంటాం, మనం అనుకోకుండానే ఆయనకు ముందే తెలిసింది. సరే, కోరిక అంటే నువ్వు అడగటమా, అనుకోవటమా? మీకు పిల్లల పెళ్లి అయితే బాగుండు అని మనసులో అనుకున్నారు, ఇంకా అడగలేదు. ఈ అనుకున్నది నీకు తెలిసింది, కానీ నువ్వు అడగకపోయినా నీకు ఏమి ఇవ్వాలో అనుకోకుండానే ఆయనకు తెలిసింది. దాన్ని కదా దయ అంటారు. కాబట్టి నువ్వు ఈశ్వరుడిని కోరిక అడిగినా ఏం తప్పు లేదు. అనుకొని అడగకపోతే అది అహం కారం అవుతుంది. మీరు అనుకున్నారుగా, ఆయనకు ముందే తెలిసిపోయింది. నువ్వు అనుకోకుండానే మెలుకువ వచ్చింది కదా. ధ్యానం గురించి, జ్ఞానం గురించి కూడా అడగక్కర్లేదు. మీకు మెలుకువ అడిగితే వచ్చిందా, అడగకుండా వచ్చిందా?

నిద్ర మెలుకువలు ఎవరైతే కల్పిస్తున్నారో, ధ్యానం కూడా వాళ్ళే చేస్తున్నారు. మీ శ్వాస ఎంత సహజంగా మీరు పట్టించుకోకపోయినా జరుగుతుందో, మీ శరీరంలో రక్త ప్రసరణ ఎలా జరుగుతుందో, అట్లానే మీకు దైవం కూడా తెలుస్తాడు. మీరు ఊరుకొని ఉండండి. మౌనంగా ఉండండి, దైవం మీకు పలుకుతాడు. ఇప్పుడు మీ నిద్రలో పొందిన శాంతి మీ మనసుకు తెలిసిందా, మీ మనసు వెళ్లి తెలుసు కుందా? నిద్రలో వచ్చిన శాంతి మనసుకే తెలిసింది, అంటే మీరు మౌనంగా ఉంటే తెలిసింది. దైవం కూడా అంతే. నువ్వు అడగకముందే ఆయనకు తెలుసు, కాబట్టి అప్పటికే నువ్వు అడిగిన వాడివయ్యావు. ఊరికే నేను ఎవరో తెలుసుకొని ఏం ప్రయోజనం, నువ్వు కానిది ఏమిటో తెలుసుకో. నీ మెలుకువ నువ్వు కాదు, నీ నిద్ర నువ్వు కాదు, ఎందుకంటే నీ ప్రమేయం లేకుండా వచ్చింది కాబట్టి. మెలుకువ ఎలా అయితే వచ్చి నీకు తెలిసిందో, నీ ఆలోచన కూడా ప్రయత్నం లేకుండా తెలిసిందో, నువ్వు అడగకుండానే తెలిసిందో, నీ జీవనంలో రోజు పనులన్నీ ఎలా అయిపోతున్నాయో, దైవం కూడా అట్లా ఎరుకలోకి వచ్చేస్తుంది. ఆకలి, నిద్ర, దాహం మీరు అడగకుండానే పెట్టాడు, వాడే ఈశ్వరుడు, గురువు అంటే వాడే. కాబట్టి ఆ మెలుకువ ఎలా అయితే వచ్చి అన్ని పనులు చేసుకొని వెళ్ళిపోయి మళ్ళా పడుకుంటుందో, అలా ఈశ్వరుడు మెలుకువ రూపంలో వచ్చి అన్ని పనులు చేసుకున్నాడు, వెళ్ళిపోయాడు. ఒకరోజు శాశ్వతంగా విశ్రాంతి తీసుకుంటాడు. ఈశ్వరుడే జన్మ తీసుకున్నాడు, ఈశ్వరుడే పోతున్నాడు; ఇది తెలియటమే మోక్షం అంటే. మోక్షం అంటే చచ్చిపోయాక వచ్చేది కాదు, బతికుండగా ఇప్పుడే అది తెలిస్తే మోక్షం. వచ్చిన మెలుకువే రాత్రి పడుకునేంతవరకు అన్ని పనులు చేసింది, మనసు కాదండి అన్ని పనులు చేసింది. వచ్చిన మెలుకువ అన్ని పనులు చేసేది, మనసు గుర్తుపట్టింది అంతే. మళ్ళీ పనులన్నీ అయిపోయాక రాత్రి తనే ఎట్లా వచ్చిందో అట్లా పోయింది. ఎట్లా సూర్యుడు అస్తమించాడో, అట్లానే మెలుకువ వచ్చి అట్లానే అస్తమిస్తుంది, దానికే నిద్ర అని పేరు. సూర్యుడు ఇక్కడ అస్తమించాడు అంటే ఇంకో దేశంలో ఉదయించాడు అని అర్థం. ఈ హృద్దేశంలో వెలుగుతాడు, బాహ్య దేశంలో అస్తమిస్తాడు; ఇది మెలుకువ. బాహ్యదేశంలో ఉదయించడం, అంతర్దేశంలో అస్తమించడం; ఇదే నిద్ర. ఈశ్వరుడే లేస్తున్నాడు, ఈశ్వరుడే పని

చేసుకుంటున్నాడు, ఆయనే పోతున్నాడు; ఇది మనసు గుర్తుపడితే చాలు, ఇదే మోక్షం అంటే. వచ్చిన మెలుకువే మీకు ఏమి ఇవ్వాలి, ఏమి ఇవ్వకూడదు, ఎప్పుడు ఏం చేసుకోవాలో తనకి తెలుసు. అదంతా చేస్తోంది మెలుకువ అండి. నువ్వు అడగకుండా వచ్చిన మెలుకువ చేస్తుందండి, నువ్వు అడగకుండగానే నిద్ర పోతుందండి. ఈ మనసు ఇవన్నీ తెలుసుకుంటే, అది మోక్షం అండి.

గురువు అంటే ఎవరు? రోజు మీ దినచర్యలో మిమ్మల్ని వాడు కంటికి రెప్పలాగా కాపాడుకుంటుంటాడు. గురువు ఆభరణం లాంటివాడు, దైవం బంగారం లాంటివాడు. కిలో బంగారం భుజం మీద వేసుకొని తిరుగుతారా? దాన్ని ఒక నెక్లెస్ లాగానో చేసుకొని వేసుకుంటారు, గురువు అట్లాంటివాడు, ఆభరణం లాంటివాడు. తన చైతన్యమును గమనించుచు తన్ను తాను మరిచినవాడిని అంటే నేను ఈ దేహము, మనసు కాదు అని తెలియటం. మెలుకువే అన్ని పనులు చేస్తుందని మరచిపోయాం. ఆ మరుపు, జ్ఞాపకం కొనసాగటమేగా జీవనం. మెలుకువ రాగానే మీకు మీరు పరిచయం అవుతారు, ఇక పనిలో పడిపోతారు. మిమ్మల్ని జ్ఞాపకం పెట్టుకొని పని చేయరు, మీకోసం పని చేస్తారు కానీ మీరని పని చేయరు. ఒకరోజున అన్ని మర్చిపోయి పడుకుంటాం. ఓహో, ఈ మెలుకువే కదా వచ్చింది, అడగకుండానే వచ్చింది, తెలియకుండానే అన్ని పనులు చేసింది; చేసిందనేమో మనసు అనుకుంటుంది, అది తెలిసి ‘ఓ అది కాదు నేను’ అనుకోవడమే మర్చిపోవడం. ఇదంతా చైతన్యం. ఏ మెలుకువ అయితే వచ్చి మీకు గుర్తు చేస్తుందో, అదే పరమాత్మ. “అబ్బాయ్ చైతన్య రూపంలో నీ శరీరంలోకి నీ మనసులోకి నీ దగ్గరికి వచ్చాను” అని గుర్తు చేస్తాడు. ఇక మనం మర్చిపోతాం, పనులలో పడిపోతాం. ఆఫీస్‌లోకి వెళ్ళాక పంచింగ్ కార్డ్ పెట్టేసి లోపలికి వెళ్లి పని చేసుకున్నట్టు, మెలుకువ రాగానే ఈశ్వరుడు సంతకం పెట్టేస్తాడు, మీ దినచర్య అంతా ఆయనే చేస్తాడు, మీరు కాదు చేసేది. అన్నం వండేది ఆయనే, కూరలు వండేది ఆయనే, తిని అరిగించుకునేది ఆయనే. మనసేమో ‘నేను’ అంటుంది, అలవాటు అయిపోయింది కదా ‘నేను నేను’ అనడం. ఇల్లు కట్టుకున్నాక ‘మంచి ఇల్లు కట్టుకున్నామండి’ అంటాం; కట్టింది మేస్త్రీలు, కూలీలు అయితే, డబ్బులు ఇచ్చి

సంబంధం లేకుండా 'నేను కట్టాను' అనడం మనసు అలవాటు. అలానే వచ్చిన మెలుకువ అన్ని పనులు చేస్తుంటే, 'నేను చేశాను' అని ఈ మనసు కూలి అంటుంది. తన్ను తాను మరిచినవాని యొక్క కష్టములన్నీ తీరును అంటే.... ఈ మనసే 'నేను చేశాను' అనుకొని దుఃఖపడుతుంటుంది, కష్టాలన్నీ దానివే, ఎరుకవి కావు. ఎరుక చాలా మౌనంగా పువ్వు వికాసం లాగా ఉంటుంది. అందుకనే జ్ఞానులు ఎంత పని చేసినా ఫ్రెష్‌గా ఉంటారు, వాళ్ళకి అలసట లేదు. ఈ దొంగ 'నేను'కే అలసట ఉంటుంది. గురువు అలా ఉండడు, అసలు పనంతా చేసేది మెలుకువ అయితే, 'నేను చేశాను' అని మనసు చెబుతుంది. ఇది అర్థమైన రోజున దానికి ముక్తి అని పేరు. మెలుకువ దానంతట అదే వచ్చింది, నాదేం లేదు అని అర్థమైతే ఏ కర్మ మిమ్మల్ని బంధించదు, మీరు పవిత్రులైపోతారు. సహజముగానే అతడు ఇతరులకు సహాయకర్త అవుతాడు. ఆ సత్యాన్ని తెలిసినవాడు మీ పక్కకు వస్తే మీ కోటి జన్మలు నశించిపోతాయి, అది గురు వైభవం. ఆత్మ యొక్క పవిత్ర దర్శనమే ఆత్మ వ్యక్తమవుట. దర్శనము అంటే చూడటం కాదు. తెలియుట అని అర్థం. మెలుకువ వచ్చింది, నిద్ర వచ్చింది, అంటే దాని ఆరంభంలో ఒక పని చేసింది, మళ్ళా పడుకునేటప్పుడు ఒక పని చేసింది, అంతే. ఎరుక చేస్తుంటే ఎరుకని చూడక మనసుని చూస్తున్నారు ఏంటి మీరు? ఇక్కడే అపార్థం చేత చూస్తాం. నిన్ను నువ్వు ఎరగటమే ఆత్మ దర్శనం అన్నారు. ఇప్పుడు మీకు పొద్దునే లేవంగానే మీరు లేచినట్టు మీకు తెలుస్తుందా తెలియట్లేదా? అది మొత్తం ఆత్మ దర్శనమే. కానీ దాన్ని మర్చిపోయాం. అందరిలోనూ ఉన్నది ఒక్కటే ఆత్మ అని తెలిసాక ద్వేషం ఎవరి మీద వస్తుంది? తన స్వీయ ఆత్మకు భక్తుడైనవాడు అందరిలోనే జీవుడు తానే అవుతాడు.

నీ ఆత్మకు నువ్వు ఎటువంటి విలువని ఇస్తావో అదే నీ నిజమైన విలువ. నువ్వు అనుకుంటావు నీ భౌతిక బయోడేటాకి, ఐడెంటిటీకి విలువ ఇస్తున్నావని, కానీ అది పొరపాటు, మనసు చేసే మాయ, అదే అహంకారం. ఇతరులను ఆత్మ యొక్క విలువతో చూడుము. ఎవరు ఇక్కడికి వచ్చారో వారు వారి అంతరంగములోని దైవం యొక్క ప్రేరణతోనే ఇక్కడికి వస్తారు, ఎవరికి ఇది ఆఖరి జన్మో వారు మాత్రమే ఇక్కడికి వస్తారు. తాను ఎరుకనని తెలుసుకున్నవాడే ఇక్కడికి వచ్చినవాడు,

ఇది ఆఖరి జన్మే మీ అందరికీ. అన్యజీవులను నీ యొక్క ఆత్మగానే భావించుము, ఆత్మ కన్నా వేరు దైవము ఉంటుంది అనే భావమును అంగీకరించవద్దు. నీ లోపల ఉన్న దైవానికి ముందే తెలిసిపోతుంది. నీ యాచకత్వమును, యాచించు స్వభావమును వదిలి నేను ఆత్మనని భావించి, నీ ఆత్మ యొక్క నిజతత్వమును పూజింపుము. ఇట్లా అనుకోవటం పేరు పూజ, నిజమైన పూజ. ఇక్కడ ఉన్నది అక్కడ ఉన్నది ఒకటే అని తెలియటం పేరే నిజమైన పూజ. నా స్వరూపమే నేను, నా హృదయంలో ఉన్నదే గురువు, నా ఉనికే గురువు, నా సమస్తము గురువే; ఈ భావన పేరు పూజ. మెలుకువ వచ్చి మనసు వస్తుంది, మనసు వచ్చి కష్టం వస్తుంది. అయితే మనసుకి ఈ కష్టాలు ఎందుకు వస్తున్నాయి అంటే... ఎరుకే వచ్చి అన్ని పనులు చేసి, ప్రశాంత హృదయంతో, ఏ దుఃఖము లేక, ఏ ద్వైత భావము లేకుండా ఎలా మెలుకువ వచ్చిపోయిందో నిద్రగా, అలా అన్ని పనులు చేసుకొని వెళ్ళిపోతుంది, అది ధ్యానం. మెలుకువ వచ్చి అన్ని పనులు జరుగుతున్నాయి కానీ మనసు వచ్చి అన్ని పనులు జరుగుతున్నాయి అనుకోకండి, అయిపోతుంది ఇదే ముక్తి. భారత్‌మాతాకీ జై

**ముఖ్యాంశాలు :** 'నేనున్నాను' అన్న ఎరుకే ఈశ్వర వైభవం. మనసు కాదు అన్ని పనులు చేసింది, వచ్చిన మెలుకువే అన్ని పనులు చేసేది. మనసు కేవలం గుర్తుపట్టింది అంతే, మనసుతో మహా అయితే గుర్తుపడతాం. మెలుకువే అన్ని పనులు చేస్తోంది, ఇంక మనసని వేరే చూడకండి. ఆ మనసులోనే నేను ఉంటుంది, నాకు ఉంటుంది, నాది, నీది, నువ్వు ఇవన్నీ ఉంటాయి. నిజానికి మనసు ఉండటమే నిజమైన దైవం, ఏది ఉందో అదే దైవం కానీ నువ్వు ఉంచుకున్నది కాదు. నీ భావనలో, నీ మనసులో మనసు కూడా ఉండవచ్చు, ఆత్మ ఉండవచ్చు, దేహం ఉండవచ్చు, దైవం ఉండవచ్చు, ప్రపంచం కూడా ఉండొచ్చు. అయినా అదంతా మనసులో భాగమే. గురువు మనతో మాట్లాడింది, మనకు చెప్పింది, జరగబోయే విషయాలపై చెప్పే భవిష్యత్‌నే మహత్యం అని మనం అనుకుంటాము. కానీ కనపడకుండా జరుగుతున్న ఆ గమ్మత్తు మీకు తెలియదు. అదే ఈశ్వర వైభవం, గురు వైభవం. నువ్వు మనసులో అనుకున్నావు కదా, ఇంకా బయటికి అడగలేదు, ఆ అనుకున్నది నువ్వు అనుకోకముందే ఆయనకు (శివుడికి, గురువుకి) తెలిసింది.

నువ్వు అడగకపోయినా నీకు ఏమి ఇవ్వాలో అనుకోకుండానే ఆయనకు తెలిసింది, దాన్నికదా దయ అంటారు. కాబట్టి నువ్వు దైవాన్ని కోరిక అడిగినా ఏం తప్పు లేదని చెప్పేది. సూర్యుడు పొద్దున హృద్దేశంలో వెలుగుతాడు, బాహ్య దేశంలో అస్తమిస్తాడు; ఇది మెలుకువ. బాహ్య దేశంలో ఉదయించటం, అంతర్దేశంలో అస్తమించడం; ఇదే నిద్ర. మెలుకువ, నిద్రలు ఇంతకంటే ఏమీ లేదు. ఈశ్వరుడే లేస్తున్నాడు, ఈశ్వరుడే పని చేసుకుంటున్నాడు, ఆయనే పోతున్నాడు; దీనిని మనసు గుర్తు పడితే చాలు, ఇదే మోక్షం అంటే, ధ్యానం అంటే. మీకు మెలుకువ అడిగితే వచ్చిందా, అడగకుండా వచ్చిందా? రాత్రి నిద్ర మీరు అడిగితే వచ్చిందా, అడగకుండా వచ్చిందా? నిద్ర, మెలుకువలను ఎవరైతే కల్పిస్తున్నారో, ధ్యానం కూడా వాళ్ళే చేస్తున్నారు ఆ నిద్ర లేచినవాడే, నిద్ర పోతున్నవాడే ధ్యానం కూడా చేస్తున్నాడు. మీ శ్వాస ఎంత సహజంగా మీరు పట్టించుకోకపోయినా జరుగుతుందో, మీ శరీరంలో రక్త ప్రసరణ ఎలా జరుగుతుందో, మీకు ఆకలి ఎప్పుడు అవ్వాలో అట్లానే జరుగుతోంది. మీ ఆకలి తెలిసినట్టుగానే మీకు దైవం కూడా తెలుస్తాడు, ఊరుకొని ఉండండి. మెలుకువ ఎలా అయితే వచ్చి నీకు తెలిసిందో, నీ మౌనంలోకి తెలిసిందో, నీ ఆలోచన కూడా ప్రయత్నం లేకుండా తెలిసిందో, నువ్వు అడగకుండానే తెలిసిందో, నీ జీవనంలో మెలుకువను అడగకుండగా, గమనించకుండగా రోజు పనులన్నీ ఎలా అయిపోతున్నాయో, దైవం కూడా అట్లా ఎరుకలోకి వచ్చేస్తుంది. ఎరుక చాలా మౌనంగా, అద్భుతంగా పువ్వు వికాసం లాగా ఉంటుంది. మెలుకువే అన్ని పనులు చేసిందని జ్ఞానికి తెలుసు. అందుకే రోజంతా గురువుగారు గాని, భగవాన్ గాని, జ్ఞానులు ఎవరైనా వాళ్ళు ఎంత పని చేసినా ఎంతో ఫ్రెష్‌గా ఉంటారు. వాళ్ళు అసలు 'నేను చేసాను' అని అనుకోరు; 'నేను చేస్తున్నా' అనుకుంటే కదా అలసట వచ్చేది. ఆ 'నేను' అనుకునేది ఎవరు? మనసు. ఏ దుఃఖము లేక, ఏ దుఃఖ స్పర్శ, ఏ ద్వైతభావము లేకుండగా చైతన్యం ఎలా నిద్రమెలుకువ రూపంలో వచ్చి పోయిందో, అలా అన్ని పనులు చేసుకొని వెళ్ళిపోతుంది. దానికే ధ్యానం అని పేరు. మెలుకువకి మెలుకువే ధ్యానము, నిద్రకి నిద్రే ధ్యానము, నిద్ర మెలుకువల మధ్య ఉన్నది అంతా కూడా ధ్యానమే. కానీ అది 'మనసు' అని అనుకోవడం చేతనే కష్టాలు వస్తున్నాయి.

# విహితకర్మలే సరళమైన సాధనామార్గం
# సినిమాలో మంటలు తెరను కాల్చవు

**శివశ్రీ రమణగురుదేవుల జ్ఞానవిచారణా సారాంశం (17.06.26)**

**సద్గురు శ్రీశివానందమూర్తి భగవానుల రుద్రభాష్యప్రసంగముల నుండి**

సద్గురు శ్రీ శివానందమూర్తి భగవానుల వారి దివ్య చరణారవిందములకు, రుద్ర మహాదేవునికి, శ్రీ ఆంజనేయ పరబ్రహ్మకు మరియు ఆత్మస్వరూపులైన శ్రోతలకు ప్రణామములు అర్పిస్తూ.... శివశ్రీ రమణ గురువుగారు అందించిన అమృతతుల్యమైన స్వీయజ్ఞాన ప్రవాహం.

## ముఖ్యాంశాలు

ఈ విహిత కర్మలతో సద్గురువులు మనకి రుద్ర భాష్యం నుంచి మన స్వధర్మాన్ని గుర్తుచేస్తున్నారు. తనను తాను తెలుసుకోవడం కంటే ఉత్తమమైన యజ్ఞం ఈ సృష్టిలో మరొకటి లేదు. అసలు 'నేను' అనే అహంకారం కంటే దుష్ట సంస్కారం ఏముంది? ఈ 'నేను' అనే భావన పోవడం కంటే పుణ్య సంస్కారం ఏముంది? అంతకంటే గొప్ప యజ్ఞం ఏముంది? ఈ స్వధర్మ పాలన, అలానే విహిత కర్మల ద్వారానే 'నేను' కరిగిపోయే అతి తేలికైన ఉపాయాన్ని సద్గురువులు మనకు బోధిస్తున్నారు. సామాన్యుడికి ఇందులో ఏమీ పెద్ద పెద్ద మంత్రతంత్రాలు, యజ్ఞ యాగాదులు, అపారమైన పాండిత్యం ఏమీ అవసరం లేదు. ఇక్కడ నాకు ఈశ్వరుడు ఇది ఇచ్చాడు, ఇది ఈశ్వర ప్రేరితము, ఇదే ప్రారబ్ధము అని నమ్మటమే పరమ సత్యం. ఇది ఎంత సత్యమో, అది ఉపనిషత్తు వాక్యమే, అదే అంతిమ వాక్యం. మన జీవితంలో రకరకాల సమస్యలు, ఘర్షణలు, అశాంతి, అనుకరణలు, అనుసరణలు వంటివన్నీ కూడా మనసులో ఒక శరణాగతి, తదధీన వృత్తి లేక పోవడం వల్లే వస్తాయి. ఈ తదధీన వృత్తి, శరణాగతి, ఈ కర్తృత్వ రాహిత్యం ఇవన్నీ కూడా చిత్తశుద్ధితోనే సాధ్యమవుతాయి. ఆ చిత్తశుద్ధి ఏమో స్వధర్మ పాలన మరియు విహిత కర్మల ద్వారా మాత్రమే వస్తుంది. అది మనకి గురువుగారు

తేలికగా అర్థమయ్యేలా చెప్పారు. ఎప్పుడైతే ఇది ఈశ్వరుడు నాకు ఇచ్చాడు అన్న భావంతో మనం కర్మలు చేస్తామో, దాంట్లో అద్భుతమైన శరణాగతి భావం నిండుతుంది. ఆ తర్వాత కర్మ మానవుడికి అంటదు. ఈశ్వరుడు ఇచ్చాడని తెలిసిన తర్వాత, ఈశ్వరుడే చేయిస్తున్నాడని గ్రహించిన తర్వాత, ఈశ్వరుడే కార్యం చేస్తున్నాడని సంపూర్ణంగా తెలిసాక మనిషి కర్మబద్ధుడు కాడు. ఆ విధంగా జీవుడు తొందరగా ముక్తుడై, జీవన్ముక్తుడై, స్వరూప జ్ఞానాన్ని పొందుతాడు. ఈ స్వధర్మ పాలన అనేది కేవలం ఒక రాజుకి, ఒక రైతుకి మాత్రమే పరిమితమైనది కాదు. సద్గురు శ్రీ శివానందమూర్తి భగవానుల వారు రుద్ర భాష్యంలో చెప్తున్నట్లు, ఆ రాజుకి పాలన, రైతుకి వ్యవసాయం విహిత కర్మలు. అవి నేరుగా పాప పుణ్యాలను ఇవ్వవు కానీ విహిత కర్మ చేయడం వల్ల చిత్తశుద్ధి కలుగుతుంది. దాన్ని మానేస్తే చిత్తంలో దుర్గుణ సంస్కారాలు పెరుగుతాయి. అందుకని వాటిని తప్పకుండా చేయాలి. ఇది నువ్వు చేయాల్సిన పని, ఇది చేయడం లేదు అని అంత:సాక్షిగా ఉన్న గురువు చెప్తూ ఉంటాడు. అందరిలో సాక్షిగా ఉన్న ఈశ్వరుడు నువ్వు చేయాల్సిన పని చేయడం లేదు, నీది కాని పని చేస్తున్నావు, ఇది వద్దు అని విడిగా వచ్చి నోరు తెరిచి చెప్పడు. మాట్లాడని సాక్షి ఈశ్వరుడైతే, మాట్లాడే సాక్షి గురువు. అందుకే గురువుని ఆశ్రయించమని పెద్దలు చెప్పారు. ఎవరికి ఈశ్వరుడు ఏ బాధ్యత అప్పచెప్పారో, ఆ కర్మ అంతా కూడా విహిత కర్మ కిందకే వస్తుంది. అందులో ముఖ్యంగా మనకి విహిత కర్మల్లో దేవతారాధన కూడా ఉంటుంది, అది కూడా హితకర్మే. వ్యవసాయం, రాజ్యపాలన కూడా అలాగే చేయటం వల్ల చిత్తశుద్ధి కలుగుతుంది.

చిత్తశుద్ధి కోసమే ఏ పనైనా చేయాలి. మరి చిత్తశుద్ధి ఎందుకు? అంటే ఈ జీవుడు ఎక్కడి నుంచి వచ్చాడో, తన ఆ గమ్యాన్ని గాని, తన అసలైన అడ్రస్ గాని మర్చిపోయాడు కదా! ఆ చిరునామాను తెలుసుకోవడం కోసమే ఈ విహిత కర్మలు, స్వధర్మ పాలన చేసుకోవాలి. అందుకని చిత్తశుద్ధి అన్నది ఈ కర్మ చేయటం వల్ల ఎందుకు వస్తుంది అంటే, చిత్తశుద్ధికి కర్మకి ఒక అద్భుతమైన సంబంధం ఉంది. ఇక్కడ నాకు ఈశ్వరుడు ఇది ఇచ్చాడు, ఈశ్వర ప్రేరితము అదే ప్రారబ్ధం

అనుకోవాలి. అసలు ఇప్పుడు ఒక కాకి తన జీవనమంతా గడుపుతోంది అంటే, దాని ప్రారబ్ధము అంటే కేవలం ఒక చెట్టు మీంచి కింద పడిపోవడం లాంటిది కాదండీ! ఇది కర్మకు సంబంధించిన సుఖదుఃఖాలకు సంబంధించిన విషయం మాత్రమే కాదు. అది కేవలం ఒక వ్యవహారిక సత్యం. పారమార్థిక సత్యం ఏమిటంటే, చీమకి చీమగా, దోమకి దోమగా ఆ సృష్టి నిర్మాణంలో ఏర్పడిందంతా కూడా అది ప్రారబ్ధ కర్మ. అలా ఎప్పుడైతే ఇది ఈశ్వరుడు ఇచ్చాడు నాకు అన్న సంపూర్ణ భావంతో మనం విహిత కర్మలను ఆచరిస్తామో, దాంట్లో శరణాగతి భావం సహజంగా వస్తుంది. ఆ పైన కర్మ అంటదు. ఈశ్వరుడు ఇచ్చాడని తెలిసిన తర్వాత, ఈశ్వరుడే చేయిస్తున్నాడని తెలిసాక, ఈశ్వరుడే కార్యం చేస్తున్నాడని నిశ్చయమైనాక జీవుడు కర్మబద్ధుడు కాడు. ఆ విధంగా తొందరగా ముక్తుడై, జీవన్ముక్తుడై తన మోక్ష హేతువైన తన గమ్యాన్ని తాను స్వరూప జ్ఞానాన్ని పొందుతాడు. 'నేను' అనే అహంకారం చిత్తశుద్ధితో పూర్తిగా కరిగిపోతుంది. చిత్తశుద్ధితోనే 'నేను' లయమవుతుంది. అది స్వధర్మ పాలన, అలానే విహిత కర్మల ద్వారానే 'నేను' కరిగే అతి తేలికైన ఉపాయం. మన జీవితంలో ఉండే గుణగణాలకు సంబంధించినవి కాకుండా, ముఖ్యమైనది ఏమిటంటే కర్తృత్వము అనే 'నేను కర్తను' అనే ఒక దుష్ట సంస్కారం. అంతకంటే దుష్ట సంస్కారం మరొకటి లేదు. 'నేను' కంటే దుష్ట సంస్కారం ఏముంది? నేను పోవడం కంటే పుణ్య సంస్కారం ఏముంది? అంతకంటే గొప్ప యజ్ఞం ఏముంది? తను తాను తెలుసుకోవడం కంటే ఉత్తమ యజ్ఞమే లేదు. ఎప్పుడైతే ఈ కర్తృత్వ భావం ఉంటుందో, అక్కడి నుంచే అనేక రకాల వికారాలు చేరతాయి, ఘర్షణ వస్తుంది, అశాంతి వస్తుంది, లేదా ఆ అనుకరణ వస్తుంది, అనుసరణ వస్తుంది. రకరకాలవన్నీ కూడా మనసులో ఒక శరణాగతి, తదదీన వృత్తి లేకపోవటం వల్లే వస్తాయి. ఈ తదదీన వృత్తి, శరణాగతి, ఈ కర్తృత్వ రాహిత్యం ఇవన్నీ కూడా చిత్తశుద్ధితో వస్తాయి. చిత్తశుద్ధి ఏమో స్వధర్మ పాలన, విహిత కర్మల ద్వారా వస్తుంది. అది మనకి గురువుగారు ఎంతో తేలికగా చెప్పారు. ఎవరికైనా, ఒక గృహిణి ఏం చేయాలి, ఓ భార్య ఏం చేయాలి, ఓ భర్త

ఏం చేయాలి, భార్యాభర్తలు ఎలా జీవించాలి, పిల్లల్ని ఎలా పెంచాలి, దేశంతో ఎలా ఉండాలి అనే విషయాలన్నీ ఇందులోంచే వస్తాయి.?

జగత్తు, జీవుడు, ఈశ్వరుడు అనే మూడు విషయాల్లో కూడా ఒక చక్కటి సమన్వయము, ఆ సంయమనము అన్నీ దీని ద్వారానే వస్తాయి. అదంత గొప్ప విషయం, అది మామూలు మాట కాదు. అప్పుడు మనం నేడు ఈ కాలంలో, ఈ దేశంలో ముఖ్యంగా భారతదేశాన్ని బాధిస్తున్న సమస్యలన్నీ కూడా ఒక్కసారిగా పోతాయి. భావం అంటే ఏమిటో గురువుగారు చెబుతున్నారు. ఒక తెర మీద సినిమా వస్తుంది, సముద్రం పొంగుతుంది, అగ్ని వస్తుంది, కానీ మనకు ఆ వెనుక ఉన్న తెర కనపడదు. ఆ తెర మీద వచ్చే దృశ్యాలన్నీ నిజంగా అనిపిస్తుంటాయి. నిజంగా మీరు వెళ్లి ఆ మంటలు ఆర్పగలరా? పోనీ సముద్రాన్ని, ఆ గాలిని, ఆ తుఫాన్ని ఆపగలరా? నిజంగా లేదు అది. భావం అంటే అది ఉన్నట్టుగా అందులో ఒకటి అయిపోతుంది. సినిమాలో వాళ్ళు వెళ్తుంటారు, ఆ హీరోనో, హీరోయిన్నో ఆ చీకట్లో, అడవిలో చాలా భయం భయంగా ఎక్కడో దూరంగా ఉన్న ఊరిలో ఏవో కీచురాళ్ళ శబ్దాలు వింటూ వెళ్తుంటాడు. అతను భయపడుతుంటాడు. అతను యాక్టర్, కానీ మనం యాక్టర్ కాదు, కేవలం ప్రేక్షకులమే. మనం ఆ అడవిలో లేము, ఆ ఘటనలో లేము, ఆ సంఘటనలో కూడా అస్సలు లేము. పోనీ సాక్షులం అనుకుందాం అంటే అదీ కాదు. ఇవేవీ లేకపోయినా వాడితో పాటు సమంగా మనం కూడా భయపడతాం. ఆ పాత్రతో పాటు మన పాత్ర కూడా ఏకమైపోతుంది. అది ఎందువల్ల అంటే ఆ తాదాత్మ్యం వల్లే, ఆ భావమే అది. భావం ఏం చేస్తుందంటే పాత్రలతో మిమ్మల్ని పూర్తిగా ఏకం చేస్తుంది. ఏ పాత్ర అయితే, స్త్రీని అయితే స్త్రీగా, పురుషుడిని అయితే పురుషుడిగా, మనిషి అనుకుంటే మనిషిగా మిమ్మల్ని మార్చేస్తుంది. సాక్షి అవ్వటం అంటే ఏమీ లేదండి, ఇక్కడ సద్గురువులు మనకు ఏం చెబుతున్నారు అంటే, అట్లాంటి అర్థమే ఆ స్వధర్మము పాలన, విహిత కర్మల యొక్క అంతరార్థం. అలా ఉన్నప్పుడు ఏమైతుంది అంటే, మీ స్వరూప జ్ఞానాన్ని మీరు గుర్తుపడతారు. స్వరూప జ్ఞానం అలా లేకపోతే, ఆ స్వరూప జ్ఞానం కోసం వృథాగా ప్రయత్నం చేస్తుంటారు.

అదే దరిద్రం. ఉండి కూడా లేదు అనుకోవటం భావ దరిద్రం. అసలు వస్తువే లేకపోతే దరిద్రం, అది వేరు విషయం. కానీ అన్నీ ఉండి కూడా లేవనుకోవడమే భావ దరిద్రం. ఇది ఆధ్యాత్మిక దరిద్రానికి దారితీయకూడదు. ఆధ్యాత్మికత అనేది దరిద్రం కాదు, అది లక్ష్మి. గురువు మౌనంగా ఉండరు, నిరంతరం చెబుతారు, ఎందుకంటే ఆయన పరమాత్మే కదా! మీతో మీరు మాట్లాడినట్టుగా పరమాత్మ ఎరుకై, పరమేశ్వరుడై, గురువై మాట్లాడతాడు.

నీ మనసుకి ఏం కష్టమో నా మనసుకి కూడా అదే కష్టం, అందుకే ధర్మం అని వాడతాం. నీకు ఏది కష్టం అనిపిస్తోందో, అది ఇతరులకు చేయకపోవడమే పరమధర్మం అన్నాం. అలానే మీ దేహము, మీ మనసు మీ ఆత్మే అయితే, మరి గురువు యొక్క దేహము, గురువు యొక్క మనసు ఎవరై ఉండాలి? పరమాత్మే ఇక అంతే, ఇంకా వేరే అక్కడ 'నేను' అనేది లేదుగా. నేను ఉన్న దేహము, నేను ఉన్న మనసు ఏమవుతుంది అంటే అది 'నేను మాత్రమే' అవుతుంది. నేను పోయిన మనసు, నేను భావం పోయిన మనసు అది. 'నేను' అనే భావం పోయిన మనసుకి ఆ దేహము, ఆ మనసు ఏమైతుందో తెలుసా? సాక్షాత్తు రుద్ర మహాదేవుడైతాడు. అదే 'నమస్తే రుద్రమన్యవ' అంటే. ఇది చిత్తశుద్ధితోనే సాధ్యం, ఇంకా మరే ఇతర ఉపాయము లేదు. కాబట్టి గురువు ఎడల అట్లాంటి కృతజ్ఞత కలిగి ఉండాలి. గురువు కంటే మీరు రెండు నిమిషాలు లేదా ఒక క్షణకాలమైనా ముందుండాలి. ఆయన నాకు మర్యాద ఇస్తున్నాడు అంటే, నిజమైన భక్తుడైతే 'వద్దండీ గురుదేవా, నాకు మర్యాద వద్దు స్వామి, నన్ను అలా చేయకండి స్వామి' అని బ్రతిమిలాడుకోవాలి. ఎందుకు మర్యాద వద్దు అంటున్నామంటే ఈ లోకంలో మనుషులను స్ఫూర్తి కంటే కీర్తి, స్థితి కంటే స్తుతి చాలా మైకంలో పడేస్తుంది. ఒక గురువు స్థానంలో ఉన్న పరమేశ్వరుడు నిన్ను మర్యాదగా పిలుస్తున్నాడు అనగానే, ఏది రాకూడదో అది వచ్చేస్తుందండీ, ఏది పోవాల్సిందో అది అస్సలు పోదండీ. ఎప్పుడన్నా మీరు ఎవరైనా మీకు ఒక గౌరవం ఇస్తే మనసు ఎలా ఉంటుందో అది గమనించండి. ఇదంతా విచారణే. కాబట్టి అట్లాంటి అహంకార మార్పు మళ్లీ తిరిగి మీకు రాకుండా ఉండాలంటే నేను ఇంకెప్పుడు పొరపాటు చేయకూడదు

అని పశ్చాత్తాపపడాలి. 'ఇంకా నేను ఎప్పుడు ఈ పొరపాటు చేయను, నా గురువు నన్ను ఇలా అనడం వల్ల నాకు అహంకారం పోవాల్సింది పోయి ఇంకా పెరిగింది కదా, వద్దు స్వామి' అనుకోవాలి. ఈ అలవాటు అయినప్పుడు ఏమైతుంది అంటే, ఇంకొకడి దగ్గర కూడా ఆ స్తుతి, ఆ కీర్తి కోరుకోకుండా మామూలుగా ఉంటాడు మనిషి. అప్పుడు శ్రీ కృష్ణమూర్తి గారు చెప్పినటువంటి 'ఆ అనామకుడిగా ఉండలేవా?', సద్గురువులు చెప్పినట్టుగా 'సామాన్యుడిగా ఉండలేవా?', భగవాన్ చెప్పినట్టుగా 'అహంకార రహితంగా ఉండలేవా?' అనే మాటలు అప్పుడు అర్థం అవుతాయి. అప్పటిదాకా ఆ మాటలు అస్సలు అర్థం కావు. మీరు ఎవరి దగ్గర మర్యాద ఆశించి మీ అహంకారం పోగొట్టుకోవాలో అక్కడ మర్యాదతో అహంకారాన్ని పెంచుకుంటే ఎట్లా? అందుకనే గుడికి వెళ్లి దండం పెట్టేది, కళ్ళు మూసుకునేది, సాష్టాంగ ప్రణామాలు చేసేది, అంత దూరం క్షేత్రానికి వెళ్ళేది దేనికి? అహంకారం పోవటానికి, కరిగిపోవటానికే వెళ్తాం. చెప్పులు అరిగేటట్టు అమ్మాయి పెళ్లి సంబంధాలు చూసినట్లే అహంకారం అరిగిపోయేట్టుగా ఈ జీవన ప్రయాణం సాగాలి. ఈశ్వరుడేమో మాట్లాడని సాక్షి, గురువేమో మాట్లాడే సాక్షి. గురువు ఎవరో కాదు సాక్షాత్తు పరమేశ్వరుడే.  మనమేమో సాక్షిగా అనుకునే మనుషులం. సాక్షిత్వం ఇంకా మనకి అనుభవంలో పూర్తిగా గోచరం అవ్వలేదు. ఒకళ్ళో ఇద్దరో సాక్షులు ఉంటారు. సాక్షి అంటే అర్థం ఏమిటి? మీరు ఆ సంఘటనకి పూర్తిగా విడిగా ఉండి, దాని బాధ, దాని స్పర్శ మీకు లేకపోవడమే సాక్షిత్వం. మరి మీ ఆకలికి మీరు సాక్షా? మీ నిద్రకి మీరు సాక్షా? ఎప్పుడు నిద్రలో ఉన్నప్పుడే సాక్షి మీరు. నిద్ర లేచాక 'నేను నిద్రకి సాక్షిని' అని మీరు అనటానికి కుదరదు, అది వ్యవహారిక సత్యమే అవుతుంది. అంటే ఒక అడుగు ముందుకు పడటానికి, అది తెలుసుకోవడానికే తప్పితే మీరు సాక్షి కాలేరు. మీ నిద్రలో మీరు సాక్షా? చెప్పండి? మీ మెలుకువలో మీరు సాక్షా? సరే మెలుకువ లేని జాగ్రత్త అవస్థ వస్తుందా?  మరి మీరు ఎలా సాక్షులు అవుతారు? ఇది తెలుసుకునేది కాదు... మీరు అది అయిపోతారు. అది అయినప్పుడు ఎలా ఉంటున్నారో చూడండి. నిద్రలో

మీరు ఎలా ఉంటున్నారు? ప్రకృతిలో పరవశం చెందినప్పుడు ఎలా ఉంటున్నారు? విడిగా ఉండట్లేదు, అది అయిపోతున్నారు. సాక్షిత్వమే అయిపోతున్నారు. జీవనంలో ప్రతి జీవి సాక్షిగా మారి జ్ఞాపకంతో, దేహ భావంతో, దేహాత్మ భావంతో 'నేను సాక్షిని అవ్వాలి' అని నిరంతరం ప్రయత్నం చేస్తాం. అది సాక్షి ముద్దాయిగా మారటం లాంటిది. ప్రతి కదలికలో సాక్షిగా ఉంటూనే, ప్రతి భావంలో నువ్వు ముద్దాయి అయిపోతున్నావు. భావం నిన్ను ముద్దాయిని చేస్తుంది, భావ శుద్ధి నిన్ను సాక్షిని చేస్తుంది. ఇది రుద్రభాష్యం అని సద్గురువులు మనకి బోధించారు. ఇదంతా చిత్తశుద్ధి, మనందరి ప్రథమ కర్తవ్యం మరియు చివరి కర్తవ్యం కూడా ఈ చిత్తశుద్ధే. ఈ చిత్తశుద్ధికి విహిత కర్మలే మార్గం. విహిత కర్మే నేను చెప్పింది. గురువుతో ఎలా జీవించాలి అన్నది కూడా ఒక విహిత కర్మ. అది అప్పుడు నాతో నేను ఉండడం తెలుస్తుంది. నువ్వు ఎవరో కాదు, నువ్వు గురువువే. మరి నేను గురువుని అని నాకు ఎలా తెలుస్తుంది అంటే, ఎప్పుడు నీ ఎదురుగా ఒక చైతన్యం వచ్చి నీ ఎదురుగా ఉందో, వారితో నీ ప్రవర్తన బాగున్నప్పుడు నీకు నువ్వు దర్శనమిస్తావు, నీకు నువ్వుగా దర్శనం ఇస్తావు. ఇది ఒక అత్యంత సులువైన మార్గం, సూటి అయిన మార్గం. అందుకనే ఒక మాట ఇక్కడ గుర్తు చేసుకుంటాం... భగవాన్ చెప్పిన మాటలు నాకు ఎంతో ఇష్టమైనవి, రోజూ మననం చేసుకునేవి: 'ధ్యానము చేయకు సంస్థితమై ఉండు, నేను ఉన్నానని భావించకు సంస్థితమై ఉండు, ఉండటం గురించి భావించకు ఉన్నావు నీవు'. అంటే మనం ఆత్మలాగా ఉండాలని, ఆ జ్ఞానంలో ఉండాలని, అలానే ఉండాలి అని అనుకుంటాం. ఆ ఉండటం అనేది జ్ఞానమే అయి ఉండవచ్చు, నేనై ఉండవచ్చు ఏదైనా కావచ్చు. కానీ అలా ఉండాలని ఉండటం కూడా అవసరం లేదు, ఉన్నావు నీవు, నువ్వు అలానే ఉన్నావు. జ్ఞానిగానూ ఉన్నావు, నువ్వు ఏ ఆత్మ అయితే అనుకుంటావో ఆ ఆత్మగానూ ఉన్నావు.

* * * * *

# At the Guru's Feet : A Guru Purnima Reflection

*- Gentela Anand Shankar*

On July 29th, we celebrate Guru Purnima, the day set aside to honor the Guru. But gratitude only means something if it changes us. This Guru Purnima, I want to share a few thoughts that have stayed with me, on the Guru Shishya tradition, on why we need a Guru at all, and on a teaching from my own Guruji that I keep returning to.

## Guru Shishya Tradition

I want to share my thoughts and understanding about the Guru Shishya tradition, and why it means far more to me than a ritual we observe once a year.

There is a story I often return to. A young boy wanted to become good, wise and strong within, like the people he admired most. One day, he found a Guru willing to teach him, but the Guru gave one condition: “I will speak only once. If you do not act on my words right away, they are lost forever.” The boy agreed.

The Guru taught him three things, one after another. First, to always know the difference between what truly matters, like love, truth, and kindness, and what only seems to matter, the things people chase but never really keep. Second, to stop working for praise or reward, and instead do what is right simply because it is right. Third, and hardest of all, to be careful with his thoughts, his words, and his actions, so that he never gossiped, never hurt anyone, and never caused harm, not even unintentionally.

Slowly, the boy understood something more. He had to trust his Guru fully, but he also had to trust himself, because the divine itself was living within him. Once he truly believed this, the Guru’s teachings no longer felt like rules imposed on him. They felt like his own true nature, simply being lived out. That boy

grew up to be J. Krishnamurti, and the book he wrote about it is called At the Feet of the Master.

Whenever I read this, I am reminded that Guru Purnima is not just about bowing to a guru. It is about carrying their words into how we actually live, the way that boy did.

### Why We Need a Guru at All

Beyond the story, I often think about why we need a Guru at all, when we could simply try to figure life out on our own.

The truth is, we do not know what we do not know. We keep learning all our lives, and we will never know fully. Every one of us is born into problems and struggles that change with our age and our circumstances, and these problems never really disappear; they only take new forms. In the middle of all this, there is barely a 1% chance that we ever turn inwards. The remaining 99% of life keeps pulling us outwards, into the material and the practical, simply because that is what survival demands of us.

That one percent chance, if we are fortunate enough to have it, is the Guru. The Guru is that hope, the one thread that quietly pulls us inward when everything else is pulling us out. Without a Guru, I believe we would be lost, unable to even recognize that there was ever an inward direction to turn towards. And when we truly surrender ourselves, not partially, but with complete sincerity, the Guru becomes our guide in every state we pass through, in joy and in sorrow, in clarity and in confusion.

This, to me, is why the Guru is not really about one person. It is gratitude for that rare inward pull, and for every Guru who has ever made it possible for us to feel it.

### Sri Sadguru Sivananda Murthy's Words

The teachings that stay with me most come from our Guruji, Sri Sadguru Sivananda Murthy.

In one of his satsangs, he spoke about our conduct and how even a small change in the way we carry ourselves can shape the course of our spiritual journey. He spoke about punya. Punya,

he said, is not about doing grand deeds, and it is not about donating everything we have. When we are not in a position to give materially, simply wishing others well is punya. Even praying that no one should sleep hungry today, a thought that costs nothing and takes only a moment, is punya.

There is a saying that just hearing a guru's name is the fruit of many lifetimes of punya. If that is true, then all of us fortunate enough to be acquainted with a guru like Sri Sadguru Sivananda Murthy are already deeply blessed, perhaps more than we realize. Gurus give us so much. What do we give back? Not money. Not a material service. Just this, making a sincere effort to understand what they teach, is enough to serve the purpose.

We rarely know how fortunate we are until the day we no longer have what we took for granted. This Guru Purnima should be the occasion that brings that change within us. And if it does not, if nothing in us shifts even now, perhaps it is worth pausing to ask why we sought the company of such a guru in the first place.




శ్రీగురుధాం ధర్మక్షేత్రంలో నిర్వహిస్తున్న శ్రీ శివానంద గాన జ్ఞానామృత కళావాణి సంగీత శిక్షణా కార్యక్రమం

# గురుపాదాల చెంత : గురుపూర్ణిమ ఆలోచనలు

**– గెంటేల ఆనంద శంకర్,** గౌరవ సంపాదకులు

**జూ**లై 29న మనం గురుపూర్ణిమను జరుపుకుంటాం. గురువుల ప్రాముఖ్యతను గుర్తుచేసుకొని, కతజ్ఞతగా పూజించే రోజు. కానీ కతజ్ఞత మనలను మార్చినప్పుడే దానికి అర్థం ఉంటుంది. ఈ గురుపూర్ణిమ సందర్భంగా నా ఆలోచనలను మీతో పంచుకోవాలనుకుంటున్నాను.

## గురు శిష్య సంప్రదాయం


గురు శిష్య సంప్రదాయం గురించి నా ఆలోచనలను, నా అవగాహనను మీతో పంచుకోవాలనుకుంటున్నాను. సంవత్సరానికి ఒకసారి జరుపుకునే ఒక ఆచారంగా కాకుండా, ఇది నాకు ఎంతో లోతైన అర్థాన్నిస్తుంది. నేను తరచుగా గుర్తుచేసుకునే ఒక కథ ఉంది. తాను గౌరవించే వ్యక్తుల్లా, లోపల మంచిగా, జ్ఞానంతో, బలంగా మారాలని ఒక చిన్న బాలుడు కోరుకున్నాడు. ఒకరోజు, అతనికి బోధించడానికి ఒక గురువును కలిశాడు, కానీ ఆ గురువు ఒక షరతు పెట్టారు: "నేను ఒక్కసారి మాత్రమే చెబుతాను. నా మాటలను వెంటనే ఆచరణలో పెట్టకపోతే, అవి శాశ్వతంగా పోతాయి." బాలుడు అంగీకరించాడు. గురువు అతనికి వరుసగా మూడు విషయాలు నేర్పించారు. మొదటిది, ప్రేమ, సత్యం, దయ వంటి నిజంగా ముఖ్యమైనవాటికి, మరియు మనుషులు వెంటపడే కానీ ఎప్పటికీ నిలవని విషయాలకు మధ్య తేడాను ఎప్పుడూ గుర్తించడం. రెండోది, పొగడ్తల కోసమో, ప్రతిఫలం కోసమో పనిచేయడం మానేసి, కేవలం అది ధర్మం కాబట్టి దానిని చేయడం. మూడోది, అన్నిటికన్నా కష్టమైనది, తన ఆలోచనలు, మాటలు, చేతలపై జాగ్రత్త వహించడం, తద్వారా ఎప్పుడూ గాసిప్ చేయకుండా, ఎవరినీ బాధపెట్టకుండా, తెలియకుండా కూడా ఎలాంటి హాని కలిగించకుండా ఉండటం. క్రమంగా, బాలుడికి మరో విషయం అర్థమైంది. తాను తన గురువును పూర్తిగా నమ్మాలి, కానీ అంతే ముఖ్యంగా తనను తాను కూడా నమ్మాలి, ఎందుకంటే తనలోనూ అదే దైవత్వం ఉంది. ఇది నిజంగా నమ్మిన తర్వాత, గురువు బోధనలు

తనపై రుద్దిన నియమాల్లా అనిపించలేదు. అవి తన నిజమైన స్వభావంగా, జీవించే విధంగా అనిపించాయి. ఆ బాలుడే పెరిగి జె. కృష్ణమూర్తి అయ్యాడు, మరియు అతను దీని గురించి రాసిన పుస్తకం పేరు ఎట్ ది ఫీట్ ఆఫ్ ద మాస్టర్. ఇది చదివినప్పుడల్లా, గురుపూర్ణిమ కేవలం గురువుకు నమస్కరించడం మాత్రమే కాదని నాకు గుర్తుకొస్తుంది. ఆ బాలుడిలా, వారి మాటలను మన నిజ జీవితంలో ఆచరణలో పెట్టడమే దీని అసలైన అర్థం.

## గురువు మనకు ఎందుకు అవసరం

కథకు మించి, గురువు మనకు ఎందుకు అవసరమో నేను తరచుగా ఆలోచిస్తాను, మనం జీవితాన్ని మనంతట మనమే అర్థం చేసుకోగలిగినప్పటికీ. నిజం ఏమిటంటే, మనకు తెలియనిది మనకు తెలియదు. మనం జీవితాంతం నేర్చుకుంటూనే ఉంటాము, ఎప్పటికీ పూర్తిగా తెలుసుకోలేము. మనమందరం మన వయసుకు, పరిస్థితులకు అనుగుణంగా మారే సమస్యలు, కష్టాలతో పుడతాము, మరియు ఈ సమస్యలు నిజంగా ఎప్పుడూ అదృశ్యం కావు, అవి కేవలం కొత్త రూపాలను తీసుకుంటాయి. వీటన్నిటి మధ్యలో, మనం లోపలికి చూసే అవకాశం ఒక్క శాతం మాత్రమే ఉంటుంది. మిగిలిన 99% జీవితం మనల్ని బయటికి లాగుతూనే ఉంటుంది. భౌతికమైన, ఆచరణాత్మకమైన వైపుకు, ఎందుకంటే మనుగడకు అదే అవసరం. ఆ ఒక్క శాతం అవకాశం, అదృష్టవశాత్తు మనకు లభిస్తే, అదే గురువు. గురువే మనకు, మన జీవితం అనే సముద్రానికి నౌక, మిగతా అంతా మనల్ని బయటికి లాగుతున్నప్పుడు నిశ్శబ్దంగా మనల్ని లోపలికి లాగే ఒకే ఒక్క దారం. గురువు లేకుండా, మనం లోపలికి తిరిగే దిశ ఉందని కూడా గుర్తించలేక, తప్పిపోతామని నేను నమ్ముతున్నాను. మరియు మనం నిజంగా, పాక్షికంగా కాకుండా పూర్తి నిష్కపటంగా శరణాగతి చెందినప్పుడు, మనం ఎదుర్కొనే ప్రతి స్థితిలోనూ, ఆనందంలోనైనా, దుఃఖంలోనైనా, స్పష్టతలోనైనా, గందరగోళం లోనైనా, గురువు మనకు మార్గదర్శిగా నిలుస్తారు. ఇందుకే, గురువు అంటే కేవలం ఒక వ్యక్తి గురించి కాదని నేను భావిస్తాను. అది ఆ అరుదైన అంతర్ముఖత్వాన్ని ప్రసాదించి మనకు దానిని అనుభూతి చెందించిన మన గురుదేవులకు కృతజ్ఞత.

## శ్రీ సద్గురు శివానంద మూర్తి గారి మాటలు



నాకు అత్యంత గుర్తుండిపోయే బోధనలు మన గురువుగారు, శ్రీ సద్గురు శివానంద మూర్తి గారి నుండి వచ్చాయి. ఒక సత్సంగంలో, ఆయన మన ప్రవర్తన గురించి మాట్లాడుతూ, మనం నడుచుకునే విధానంలో చిన్న మార్పు కూడా మన ఆధ్యాత్మిక ప్రయాణాన్ని ఎలా మలచగలదో చెప్పారు. ఆయన పుణ్యం గురించి మాట్లాడారు. పుణ్యం అంటే గొప్ప పనులు చేయడం కాదని, మన కున్నదంతా దానం చేయడం కూడా కాదని ఆయన అన్నారు. మనం భౌతికంగా ఇవ్వలేని స్థితిలో ఉన్నప్పుడు, కేవలం ఇతరుల మేలు కోరుకోవడమే పుణ్యం. ఈరోజు ఎవరూ ఆకలితో నిద్రపోకూడదని ప్రార్థించడం కూడా, ఖర్చు లేని, ఒక్క క్షణం మాత్రమే పట్టే ఆలోచన, పుణ్యమే. గురువు పేరు వినడమే ఎన్నో జన్మల పుణ్యఫలమని ఒక మాట ఉంది. అది నిజమైతే, శ్రీ సద్గురు శివానంద మూర్తి గారి వంటి గురువుతో పరిచయం ఉన్న మనమందరం ఇప్పటికే ఎంతో అదృష్టవంతులం, బహుశా మనం గుర్తించేదానికన్నా ఎక్కువగానే. గురువులు మనకు ఎంతో ఇస్తారు. మనం తిరిగి ఏమి ఇస్తున్నాము? డబ్బు కాదు. భౌతిక సేవ కాదు. వారు బోధించిన దాన్ని అర్థం చేసుకోవడానికి నిజాయితీగా ప్రయత్నించడమే మనం ఇవ్వగలిగింది. మనకున్నది పోయేంతవరకు మనం ఎంత అదృష్టవంతులమో మనకు తెలియదు. ఈ గురుపూర్ణిమ మనలో ఆ మార్పును తీసుకురావాలి. అలా జరగకపోతే, ఇప్పటికీ మనలో ఏమీ మారకపోతే, అసలు మనం ఇలాంటి గురువు సాంగత్యాన్ని ఎందుకు కోరుకున్నామో ఆలోచించడం మంచిది.

* * * * *




2004 లో రామాపురం గ్రామంలో శివ శ్రీ రమణ గురుదంపతులు
ప్రారంభించిన సామూహిక ఏరువాక పౌర్ణమి





సామూహిక ఏరువాక పౌర్ణమి కోసం శివశ్రీ రమణ గురు దంపతుల నుండి
ధాన్యాలు స్వీకరిస్తున్న రామాపురం గ్రామ రైతులు (27.06.26)



# ప్రార్థన

పరమపూజ్య గురుదేవా !

నీవు అనంతమైన ఇచ్ఛాశక్తికి, బలానికి మూలస్థానానివి.
నీ నుండి అవ్యయమైన శక్తిని, పవిత్రతను, జ్ఞానాన్ని పొందేవిధంగా
నిన్ను మరిచిపోకుండా ఉండేటట్లు నాలో నిలిచిపో,
నీవు నా కండ్లద్వారా చూడు, నా చెవులద్వారా విను.
దానివల్ల నీ అవగాహన నాది అవుతుంది. నన్ను నీకు మాత్రమే
సమర్పణ చేసుకొంటున్నాను. ఆభాసంగా నాకు నీ నుండి ఏది
లభించినా, లభించకపోయినా నీవు వినా వేరొక ఆధారాన్ని
నేను ఆశ్రయించను. నా జీవితంలోని అన్ని క్షణాలలోను నీయందు
నిశ్చలమైన విశ్వాసాన్ని కలిగిఉండేటట్లు చేయి.
ఈ క్షణంనుండి నా దుఃఖాలన్నీ నా కర్మక్షయంకోసం
నా లోపాల్ని సరిదిద్దడంకోసం నీవిచ్చినట్టుగా భావిస్తాను.
అతిశీఘ్రంగా నన్ను నేను తెలుసుకోవడానికి
నా కోసం ఏర్పడ్డ మార్గం యిది.



## గురుదేవుల హారతి

నీరాజనంబీయరే ॥ కర్పూర నీరాజనంబీయరే ॥
ఆనందవనమందునా నెలకొన్న ॥ శ్రీ శివానందునకు
విశ్వమెల్లను నిండిన సద్గురు ॥ స్వామికిని మన ప్రభువునకు ॥
లోకముల కాధారుడై ॥ భక్తులను బ్రోచు చల్లని తండ్రికి ॥
జన్మరాహిత్యమ్మునే మనకిచ్చు ॥ అచ్యుతుని మనమనసులో ॥
స్థిరముగా నెలకొన్న శ్రీ విభునకు ॥ శ్రీ శివానందునకు ॥
నరజన్మ సఫలమవగా ॥ కోరకనే ఆత్మ జ్ఞానమునిచ్చెడి ॥
విశ్వశాంతుని కిష్టమౌ ॥ పూజలను చేయుతరి మన తండ్రికి ॥
మనతనువే ఆలయముగా ॥ మనసునే కర్పూర శకలములుగా చేసి
భక్తియే మాలగా ॥ శశిధరుని కనవరత మర్చించుచు ॥ ॥నీరాజనం॥

---

ఆవాచాత్మ స్వరూపాయ శివభావ ప్రదాయినే
నమః సద్గురు నాథాయ శ్రీ రమణాయ మంగళం
సర్వదేవ స్వరూపాయ సర్వకాల స్థితాయచ
సర్వవ్యాప్త దేవాయ శివానందాయ మంగళం
ఆర్తజన రక్షా దక్షాయ ఆనంద నిలయ నివాసినే
త్రిమూర్తి స్వరూపాయ శ్రీ శివానందాయ మంగళం
ధర్మస్య జయోస్తు - అధర్మస్యనాశోస్తు
ప్రాణిషు సద్భావనాస్తు - విశ్వస్య కళ్యాణమస్తు

ఓం శాంతిః శాంతిః శాంతిః